ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
కర్నూలు జిల్లా వార్తలు 5
మంగళవారం 25 జూన్ 2024



ప్రమాణ స్వీకారం చేస్తున్న ఎంపీ బైరెడ్డి శబరి

ఎంపీలుగా ప్రమాణం



పార్లమెంట్‌లో ఎంపీగా ప్రమాణ స్వీకారం చేస్తున్న బస్తిపాటి నాగరాజు



పార్లమెంట్‌లో కుటుంబ సభ్యులతో ఎంపీ బస్తిపాటి నాగరాజు

కర్నూలు, జూన్ 24 (ఆంధ్రజ్యోతి)/నంద్యాల (నూనెపల్లె): కర్నూలు పార్లమెంట్ స్థానం నుంచి టీడీపీ అభ్యర్థిగా గెలుపొందిన బస్తిపాటి నాగరాజు సోమవారం ప్రమాణం చేశారు. అలాగే నంద్యాల పార్లమెంట్ నుంచి గెలుపొందిన బైరెడ్డి శబరి కూడా ప్రమాణ స్వీకారం చేశారు. లోక్‌సభ ప్రొటెం స్పీకర్ భర్తృహరి మహతాబ్ వీరితో ప్రమాణ స్వీకారం చేయించారు. నాగరాజు ప్రమాణ స్వీకర మహోత్సవాన్ని పార్లమెంట్ విజిటింగ్ గ్యాలరీ నుంచి ఆయన కుటుంబ సభ్యులు వీక్షిస్తూ ఆనందపరవశితులయ్యారు. అనంతరం పార్లమంట్ ప్రాంగణంలో కుటుంబ సభ్యులతో కలిసి ఫొటోలు దిగారు. ఈ సందర్భంగా ఆయన ఆంధ్రజ్యోతితో మాట్లాడుతూ ఒక సామాన్యుడిని పార్లమెంట్‌కు పంపిన ఘనత తమ అధినేత, సీఎం చంద్రబాబుకే దక్కుతుందన్నారు. ఇదిలాఉంటే నంద్యాల లోక్ సభ చరిత్రలో తొలి మహిళా ఎంపీగా బైరెడ్డి శబరి చరిత్ర పుటల్లో నిలిచారు. రాజకీయ కుటుంబ వారసురాలుగా డాక్టర్ బైరెడ్డి శబరి చిన్న వయస్సులోనే ఎంపీగా విజయం సాధించడం ప్రత్యేకతను సంతరించుకుంది.



రైతు కన్నీరు ఆగేనా..?

- గత వైసీపీ ప్రభుత్వంలో అష్టకష్టాలు
- కాగితాల్లోనే పథకాలు.. నిబంధనల పేరుతో అన్యాయం
- ముప్పతిప్పలు పెట్టిన సున్నా వడ్డీ
- ఐదేళ్లు సూక్ష్మ పోషకాలు మాయం
- టీడీపీ ప్రభుత్వ ఆదుకుంటుందని రైతుల ఆశ

కర్నూలు(అగ్రికల్చర్), జూన్ 24:

ఐదేళ్లుగా వైసీపీ ప్రభుత్వంలో తమకు కన్నీళ్లు తప్ప సంతోషం లేదని ఆవేదన చెందిన రైతులు తెలుగుదేశం పార్టీకి పట్టం కట్టారు. ఈ ప్రభుత్వంలో అయినా తమ కష్టాలు తీరుతాయా? అని రైతులు ఎదురు చూస్తున్నారు. ఉమ్మడి కర్నూలు జిల్లాలోని 7 లక్షల మంది రైతులు గత ప్రభుత్వంలో అనేక అన్యాయాలకు గురయ్యారు. ఆ వివరాలు ఇలా ఉన్నాయి..

బ్యాంకుల్లో రుణం రూ. లక్షలోపు తీసుకున్న రైతులకు వడ్డీని 7 శాతం రైతులు చెల్లించాల్సిన అవసరం లేదని, ప్రభుత్వమే చెల్లిస్తుందని వైసీపీ ప్రభుత్వం గత ఎన్నికల సమయంలో ప్రకటించింది. ఉమ్మడి కర్నూలు జిల్లాలో నాలుగున్నర లక్షల మంది చిన్న, సన్నకారు రైతులు బ్యాంకుల్లో రుణం తీసుకుంటే.. వారిలో కేవలం లక్ష మంది రైతులకు మాత్రమే ఈ సున్నావడ్డీ పథకాన్ని వర్తింపజేశారు. ఈ నిర్ణయంతో రైతులు కుప్పకూలిపోయారు. చాలా మంది రైతులకు సున్నావడ్డీ పథకం అమలు కాకపోవడంతో బ్యాంకులు, సహకార సంఘాలు, వ్యవసాయ శాఖ కార్యాలయాల చుట్టూ తిరిగారు. కొత్తగా వచ్చిన తెలుగుదేశం ప్రభుత్వం బ్యాంకులకు, సహకార సంఘాలకు వడ్డీని చెల్లించేలా నిర్ణయం తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.



మొక్కుబడిగా పొలంబడి కార్యక్రమం

సూక్ష్మ పోషకాలేవి..?

నిస్సారమైన భూములను సారవంతం చేసే సూక్ష్మ పోషకాలను రైతులకు పంపిణీ చేసే పథకాన్ని గత వైసీపీ ప్రభుత్వం అటకెక్కించి చేసింది. కొన్ని నెలలపాటైనా ఈ పథకాన్ని అమలు చేయలేదు. ఐదే ళ్లుగా రైతులు సూక్ష్మ పోషకాలకు దూరమైపోయారు. తెగుళ్లు, క్రిమి కీటకాలతో పంటలు సక్రమంగా చేతికి అందక రైతులు కష్టాల పాలయ్యారు. తెలుగుదేశం ప్రభుత్వం ఆదుకోవాలని ఆశిస్తున్నారు.



రెండేళ్లుగా డ్రిప్పు కనుమరుగు

జిల్లాలోని వర్షాధార పశ్చిమ నియోజకవర్గాలకు గత వైసీపీ ప్రభుత్వం రెండేళ్లు డ్రిప్పు పథకాన్ని కనుమరుగు చేసింది. ఉమ్మడి కర్నూలు జిల్లాలో దాదాపు బోర్లు, బావులు కలిగిన రూ.లక్షన్నర మంది రైతులకు ఈ పథకాన్ని అమలు చేయాల్సింది పోయి డ్రిప్పు కంపెనీలకు సక్రమంగా బిల్లులు చెల్లించకపోవడంతో వారు రైతుల పొలాల్లో డ్రిపు పరికరాలను ఏర్పాటు చేసేందుకు ముందుకు రాలేదు. మెట్ట వ్యవసాయం చేసే రైతులకు డ్రిప్పు పథకం ప్రాధాన్యతను ముఖ్యమంత్రి చంద్రబాబు గుర్తించాలని రైతులు కోరుతున్నారు.

- పొలం బడి కార్యక్రమాన్ని వైసీపీ ప్రభుత్వం కేవలం కాగితాలకే పరిమితం చేసింది. కొన్ని మండలాల్లో పొలంబడి కార్యక్రమాన్ని ఆర్‌బీకే కేంద్రాల్లోని సిబ్బంది చేత బలవంతంగా అమలు చేశారు. ఆ కార్యక్రమానికి నిధులు సమకూర్చుకునేందుకు ఆర్‌బీకే కేంద్రాల సిబ్బందితో పాటు మండల వ్యవసాయాధికారులు నానా కష్టాలు పడ్డారు. వారికి ఇప్పటి దాకా బకాయిలు చెల్లించలేదు. టీడీపీ ప్రభుత్వం పొలంబడి కార్యక్రమాలు సక్రమంగా జరుగుతాయని ఉమ్మడి జిల్లాలోని 7 లక్షల మంది రైతులు ఆశతో ఉన్నారు.

రాయితీలో ఉన్న కోత

ప్రభుత్వం ఏటా ఖరీఫ్, రబీ సీజన్లలో వివిధ పంటలకు 40 నుంచి 50 శాతం సబ్సిడీతో రాయితీ విత్తనాలను అందించే కార్యక్రమాన్ని వైసీపీ ప్రభుత్వం పట్టించుకోలేదు. దీని వల్ల ఏపీ సీడ్స్ సంస్థకు అందించే వ్యాపారులు లబ్ధి పొందడం తప్పితే.. రైతులకు ఏమాత్రం ప్రయోజనం కలగలేదు. ఇప్పుడు తెలుగుదేశం ప్రభుత్వం ఈ సమస్యను పరిష్కరించాల్సి ఉంది.

మట్టి పరీక్షలు గాలిలోనే

గత ఐదేళ్లగా వైసీపీ ప్రభుత్వం పొలంలో సారాన్ని తెలుసుకొనే భూసార పరీక్షలను అటకెక్కించేసిందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తమ పొలాల్లో ఏయే ఎరువుల కొరత ఉందో తెలుసుకునేందుకు భూసార పరీక్షలే ఆధారమని, తెలుగుదేశం ప్రభుత్వం భూసార పరీక్షలను క్రమం తప్పకుండా తమ పొలాల్లో చేపట్టాలని కోరుతున్నారు.



పథకాలను సక్రమంగా అమలు చేయండి

గత వైసీపీ ప్రభుత్వ హయాంలో అన్నదాతలకు ఎంతో నష్టం జరిగింది. పథకాలన్నీ కాగితాల్లో తప్పితే.. ఆచరణలో ఏ మాత్రం జరగలేదు. ప్రకృతి వైపరీత్యాలతో రైతులు నష్టపోతే అరకొరగానే ఇన్‌పుట్ సబ్సిడీని అందించారు. తెలుగుదేశం ప్రభుత్వమైనా రైతులకు ఉద్దేశించిన పథకాలను సక్రమంగా అమలు చేయాలి.

- జగన్నాథం, రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి



ప్రారంభమైన ప్రజా సమస్యల పరిష్కార వేదిక



అర్జీలను స్వీకరిస్తున్నకలెక్టర్ డా. జి సృజన, జేసీ నారపురెడ్డి మౌర్య

కర్నూలు(కలెక్టరేట్), జూన్ 24: జిల్లాలో సోమవారం 'మీ కోసం' ప్రజా సమస్యల పరిష్కార వేదిక అట్టహాసంగా ప్రారంభమైంది. కలెక్టరేట్‌లోని సునయన ఆడిటోరియంలో సమస్యల పరిష్కారం కోసం అర్జీలు ఇచ్చేందుకు ప్రజలు వచ్చారు. ఉదయం 9.30 గంటల నుంచి అర్జీలు ఇవ్వడానికి అర్జీదారులు బారులు తీరారు. గత వైసీపీ ప్రభుత్వంలో స్పందన కార్యక్రమంలో ఇచ్చిన సమస్యలు పరిష్కారం కాలేదని అర్జీదారులు అసంతృప్తి వెలుబుచ్చారు.

అధికారులు బాధ్యతగా విధులు నిర్వర్తించాలి: నూతనంగా ఏర్పడిన ప్రభుత్వ ఆశయాలకు అనుగుణంగా అధికారులు విధులను బాధ్యతతో నిర్వర్తించాలని కలెక్టర్ డా.జి. సృజన అన్నారు. సోమవారం కలెక్టరేట్‌లోని సునయన ఆడిటోరియంలో ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్‌గా బదిలీపై వెళ్లనున్న సందర్భంగా కలెక్టర్ జిల్లా అధికారులనుద్దేశించి మాట్లాడారు. అనంతరం ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో పాల్గొని ప్రజల నుంచి వినతులను స్వీకరించారు. అనంతరం జాయింట్ కలెక్టర్ నారపురెడ్డి మౌర్యకు ఇన్‌చార్జి కలెక్టర్ బాధ్యతలు అప్పగించి కలెక్టర్ రిలీవ్ అయ్యారు.

నిర్ణీత గడువులోపు అర్జీలను పరిష్కరించాలి: ప్రజా సమస్యల పరిష్కార వేదికలో వచ్చే అర్జీలను నిర్దేశిత గడువులోపు పరిష్కరించడంతో పాటు ఏ ఒక్క అర్జీ బియాండ్ ఎస్ఎల్ఏ, రీ ఓపెన్ కాకుండా నాణ్యతతో కూడిన ఎండార్స్‌మెంట్ ఇవ్వాలని జిల్లా ఇన్‌చార్జి కలెక్టర్ జేసీ నారపురెడ్డి మౌర్య సంబంధిత అధికారులను ఆదేశించారు. ప్రజా సమస్యల పరిష్కారాల వేదిక ద్వారా 92 అర్జీలు వచ్చాయని అన్నారు. అందులో 69 అర్జీలు ప్రాసెస్‌లో ఉన్నాయన్నారు. కార్యక్రమంలో డీఆర్వో మధుసూదన్‌రావు, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ నాగప్రసన్నలక్ష్మి, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

పేదల బియ్యం కర్ణాటకకు తరలింపు

- నకిలీ ఆర్‌వో బిల్లులతో 122 క్వింటాళ్లు రవాణా





కర్ణాటకకు తరలి వెళ్తున్న రేషన్ బియ్యం

హొళగుంద, జూన్ 24: ఆలూరు మండలం లెవెల్ సివిల్ సప్లయి పాయింట్ (ఎంఎల్ఎస్‌పీ)లో పని చేసే ఓ ఉద్యోగి వ్యవహారం కంచె చేను మేసిందన్న చందనంగా మారింది. పేదలకు పంపిణీ చేయాల్సిన బియాన్ని ఆ ఉద్యోగి యథేచ్ఛగా కర్ణాటకకు తరలిస్తున్నాడు. సోమవారం సాయంత్రం ఏపీ 39 టీఆర్ 8202 నెంబర్ గల లారీలో 122 క్వింటాళ్ల బియ్యాన్ని ఆలూరు సివిల్ సప్లై గోడౌన్ నుంచి హొళగుంద మీదుగా కర్ణాటకకు తరలించాడు. సదరు ఉద్యోగి హొళగుందకు చెందిన రేషన్ అక్రమ రవాణా చేసే దళారులతో కలిసి నకిలీ ఆర్‌వో బిల్లులతో బియ్యాన్ని తరలిస్తున్నాడు. వీరికి అండగా హొళగుందకు చెందిన ఓ రెవెన్యూ అధికారి ఉన్నట్టు తెలుస్తోంది. ఈ విషయంపై ఆలూరు సివిల్ సప్లై గోడౌన్ ఇన్‌చార్జి రఘురామిరెడ్డిని వివరణ కోరగా ఆ బియ్యం ఆలూరు సివిల్ సప్లై గోడౌన్ నుంచి పంపిన మాట వాస్తవమేనని అన్నారు. అయితే అవి తినడానికి పనికి రావని, అందుకే వాటిని ఆదోనికి తరలించగా డ్రైవర్ పొరపాటున హొళగుంద వైపు వచ్చినట్లు తెలిపారు. ఈ విషయాన్ని ఇక్కడే వదిలేయాలని, ఏదైనా ఉంటే మాట్లాడుకుందామని అన్నాడు.

బసవన్నలకు హాలిడేస్



చిన్నభోంపల్లిలో ముస్తాబైన ఎద్దులతో రైతు

కోసిగి, జూన్ 24: ఉద్యోగులు, విద్యార్థులకు సెలవులు ఉంటాయి.. బసవన్నలకు సెలవులు ఏమిటని ఎవరైనా ఆశ్చర్యపోతారు. రైతులకు ఆరుగాలం పని తప్ప, సెలవు ఇచ్చేవారు ఎవరుంటారు. అయితే.. రైతులకు కష్టమెరిగిన మనసు ఉంటుంది. తమతో పాటు రేయింబవళ్లు ఏడాదంతా పని చేసే ఎద్దుల శ్రమ గురించి వారికి బాగా తెలుసు. అందుకే ఏడాదిలో రెండు రోజులు బసవన్నలను ముస్తాబు చేసి హాలిడేస్ ఇస్తారు. కర్నూలు జిల్లా కోసిగి మండలం చిన్నభోంపల్లి రైతులు ఏరువాక పౌర్ణమి సందర్భంగా రెండు రోజులపాటు పొలంలో ఎంత పని ఉన్నా ఎద్దులతో పనిచేయించరు. గడప, ఊరు దాటించరు. ఇళ్లలో తమ కోసం చేసుకున్న వంటలను బసవన్నలకు తినిపించి, డప్పు వాయిద్యాలతో ఊరేగించి వేడుక చేస్తారు. సోమవారం చిన్నభోంపల్లిలో ఏరువాక పౌర్ణమి సందర్భంగా బసవన్నలను ముస్తాబు చేసి ఊరేగిస్తారు.

చిన్నభోంపల్లిలో ఏరువాక పౌర్ణమి ప్రత్యేకత

ఎద్దులే మా దేవుళ్లు

ఏడాదంతా మా కష్టంలో.. నష్టంలో మా వెన్నంటి ఉండే బసవన్నలే మాకు దేవుళ్లు. ఏరువాక పౌర్ణమి సందర్భంగా రెండు రోజులపాటు బసవన్నలతో పనులు చేయించకుండా ఇంట్లోనే ఉంచుకుంటాం. ఇది మా పూర్వీకుల నుంచి వస్తున్న ఆచారం.

- మాధవరం చిన్నారెడ్డి, రైతు

ఫిర్యాదుల స్వీకరణ

- సమస్యలను త్వరితగతిన పరిష్కరిస్తాం
- ఎస్పీ జి. కృష్ణకాంత్

కర్నూలు, జూన్ 24: స్థానిక కొత్తపేట టూటౌన్ పోలీస్‌స్టేషన్ సమీపంలోని ఎస్పీ క్యాంపు కార్యాలయంలో సోమవారం ఎస్పీ జి.కృష్ణకాంత్ ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రజల నుంచి వచ్చే ఫిర్యాదులను స్వీకరించారు. ఈ కార్యక్రమానికి మొత్తం 54 ఫిర్యాదులు వచ్చాయి.

- ఎమ్మిగనూరుకు చెందిన మహేష్ అనే వ్యక్తి ఎయిర్‌టెల్, డీటీహెచ్ నెట్‌వర్క్‌ల గురించి నేర్పించి డీలర్‌షిప్ ఇప్పిస్తానని చెప్పి రూ.10 లక్షలు తీసుకుని తప్పించుకుని తిరుగుతున్నాడని ఎమ్మిగనూరుకు చెందిన బి.రమేష్ ఫిర్యాదు చేశారు.
- తన భర్త వివాహేతర సంబంధం ఏర్పరుచుకున్నాడని, ఆమెకు తన నగలు తీసుకెళ్లి ఇచ్చాడని హాలహర్వి మండలం గూళ్యం గ్రామానికి చెందిన చాంద్‌బీ ఫిర్యాదు చేశారు.
- కంటి చూపు సరిగా లేని, కాళ్ల నొప్పులు ఉన్న తనను కొడుకు, కోడలు ఇంట్లో ఉండ నివ్వకుండా చిత్రహింసలకు గురి చేస్తున్నారని దేవనకొండకు చెందిన అల్లెమ్మ ఫిర్యాదు చేశారు.
- తాను మున్సిపాలిటీలో ఉద్యోగం చేస్తూ రిటైర్ అయ్యానని, ఇల్లు, రిటైర్‌మెంట్ బెనిఫిట్స్ తీసుకొని కొందరు వ్యక్తులు బాండ్లపై సంతకాలు చేయాలని భయభ్రాంతులకు గురి చేస్తున్నారని ఆదోని ఎంఐజీ కాలనీకి చెందిన కె.పుష్ప ఫిర్యాదు చేశారు. ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ కార్యక్రమానికి వచ్చిన ఫిర్యాదులన్నింటిపై చట్ట ప్రకారం విచారణ జరిపి, బాధితులు న్యాయం చేస్తానని సమస్యలు త్వరితగతిన పరిష్కరిస్తానని జిల్లా ఎస్పీ జి.కృష్ణకాంత్ హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో డీఎస్పీ జే బాబు ప్రసాద్, లీగల్ అడ్వైజర్ మల్లికార్జున రావు, సీఐ శివశంకర్ పాల్గొన్నారు.



ఫిర్యాదులు స్వీకరిస్తున్న ఎస్పీ

తహసీల్దార్ కాళ్లకు మొక్కిన రైతు

● మా పొలం మాకు ఇప్పించడంటూ వేడుకోలు



తహసీల్దార్ దామోదరెడ్డికి కాళ్లకు మొక్కుతున్న రైతు మధుసూదన యాదవ్

నందికొట్కూరు రూరల్, జూన్ 24: 'అయ్యా మా పొలం మాకు ఇప్పించండంటూ' సోమవారం ఓ రైతు తహసీల్దార్ దామోదరెడ్డి కాళ్లకు మొక్కారు. ఈ ఊహించని పరిణామంతో ఖంగుతిన్న తహసీల్దార్ వెంటనే ఆయనను పైకి లేపారు. నంద్యాల జిల్లా నందికొట్కూరు తహసీల్దార్ కార్యాలయం ఎదుట దామగట్లకు చెందిన రైతు మధుసూదన యాదవ్ సోమవారం తన కుటుంబ సభ్యులతో కలిసి నిరసనకు దిగాడు. అనంతరం తహసీల్దార్ కార్యాలయంలో ప్రజా పరిష్కార వేదిక నిర్వహిస్తుండగా కుటుంబ సభ్యులతో వచ్చి తమ పొలాన్ని బంధువులు ఆన్‌లో ఎక్కించుకున్నా రని, అది తొలగించి న్యాయం చేయాలని వినతి పత్రం అందజేశారు. అనంతరం బాధిత రైతు తహసీల్దార్‌తో మాట్లాడుతూ దామగట్ల గ్రామ పొలిమేరలోని సర్వే నెంబర్ 192-2లో 1.06 ఎకరాలు తమ అమ్మ లక్ష్మీదేవమ్మకు, సర్వే నెంబర్ 279-1లో 0.80 సెంట్లు, సర్వే నెంబర్ 279-2లో 0.24 సెంట్లు తనకు ఉందని తెలిపాడు. అది తమ పూర్వీకుల నుంచి వారసత్వంగా సంక్రమించిన భూమి అని, తమ పేర్లపై మ్యాన్యువల్ రికార్డులు ఉన్నా స్థానిక వీఆర్వో అక్రమంగా తమ బంధువులకు ఆన్‌లైన్ చేశాడని ఆరోపించాడు. ఈ విషయంపై నాలుగేళ్లుగా తహసీల్దార్ కార్యాలయం చుట్టూ తిరుగుతున్నా న్యాయం జరగడం లేదని వాపోయాడు. ఆర్డీవో, కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లినా న్యాయం జరగలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా న్యాయం చేయాలని కోరారు.

దాతల సొమ్ము దుర్వినియోగంపై లోకాయుక్తలో ఫిర్యాదు



ఫిర్యాదు చేసిన టీడీపీ నాయకుడు వెంకటేశ్వర్లు

కోడుమూరు (రూరల్), జూన్ 24: కోడుమూరు మండలంలోని అమడగుంట్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో దాతలు అందించిన సొమ్ము దుర్వినియోగమైందని కర్నూలు లోక్‌సభ టీడీపీ ఉపాధ్యక్షుడు వెంకటేశ్వర్లు సోమవారం లోకాయుక్తలో ఫిర్యాదు చేశారు. విద్యార్థులను చదువులో ప్రోత్సహించడానికి దాతలు సుమారు రూ 2 లక్షలు సొమ్ము ఇచ్చారు. దీనికి వచ్చే వడ్డీతో ఏటా పదో తరగతిలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు ఆగస్టు 15న నగదు ప్రోత్సాహకం అందజేస్తున్నట్లు తెలిపారు. అయితే 2023లో విద్యార్థులకు ప్రోత్సాహక బహుమతి అందలేదని తెలిపారు. ఈ విషయంపై పాఠశాల ఉపాధ్యాయులను నిలదీయగా పొంతన లేని సమాధానం చెబుతున్నారని పేర్కొన్నారు. సొమ్ము లెక్కలు తేల్చాలని ఈ ఏడాది ఫిబ్రవరి 26న కలెక్టర్, డీఈవోలకు స్పందనలో అర్జీ ఇచ్చినట్లు తెలిపారు. దీనిపై విచారణాధికారిగా డిప్యూటీ డీఈవోను నియమించారని తెలిపారు. అయినను ఎంక్వైరీ చేపట్టలేదని ఆరోపించారు. పైగా నిర్లక్ష్యంగా సమాధానం ఇచ్చారని తెలిపారు. ఇప్పటికైనా విచారణ జరిపించి దాతల సొమ్ము వాడుకున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఫిర్యాదులో కోరారు.

వ్యవసాయ బోరు బావి ధ్వంసం

సి. బెళగల్, జూన్ 24: మండలంలోని బ్రాహ్మణదొడ్డి గ్రామానికి చెందిన కృష్ణ అనే రైతు పొలంలోని వ్యవసాయ బోరుబావిని గుర్తు తెలియని దుండగులు ధ్వంసం చేశారు. రైతు సోమవారం ఉదయం పొలానికి వెళ్లి చూడగా బోరుబావిని రాయితో ధ్వంసం చేసి బోరుబావిలోకి రాళ్లు వేసినట్లు కనిపించింది. ఇటీవల రూ లక్షన్నర అప్పు చేసి బోరు వేయించుకున్నానని రైతు తెలిపారు. ఎస్ఐ తిమ్మారెడ్డి గ్రామంలో విచారణ చేపట్టి కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

ఇద్దరు పంచాయతీ కార్యదర్శుల సస్పెండ్

జూపాడుబంగ్లా, జూన్ 24: పంచాయతీ కార్యదర్శి సామేలు, సచివాలయ కార్యదర్శి మంజులను సస్పెండ్ చేస్తూ కలెక్టర్ ఉత్తర్వులు జారీ చేసినట్లు ఎంపీడీవో నూర్జహాన్ తెలిపారు. అలాగే ఈవోఆర్డీ మధుమోహన్‌చక్రవర్తికి షోకాజ్ నోటీసులు జారీ చేసినట్లు ఆమె వెల్లడించారు. కలుషిత నీరు తాగి మండలంలోని పోతులపాడు మజరా గ్రామం చాబోలులో కలుషిత నీరు తాగి 30 మందికిపైగా అస్వస్థతకు గురికావడమే కాకుండా ఒకరి మృతి చెందిన విషయం తెలిసిందే. ఈ మేరకు వారిపై చర్యలు తీసుకున్నట్లు ఎంపీడీవో తెలిపారు.

వ్యక్తి అదృశ్యం.. కేసు నమోదు

కోవెలకుంట్ల, జూన్ 24 : కోవెలకుంట్ల పట్టణంలోని ఏపీఎస్ ఆర్టీసీ వద్ద ఓ వ్యక్తి అదృశ్యంకావడంతో కేసు నమోదు చేసినట్లు సోమవారం ఎస్ఐ వరప్రసాద్ తెలిపారు. కడప జిల్లా ముద్దనూరు మండలం కె.తిమ్మాపురం గ్రామానికి చెందిన గంగాధర్‌రెడ్డి తండ్రి ప్రభాకర్‌రెడ్డి బంధువుల ఇంటికి వచ్చి తిరిగి వచ్చే క్రమంలో కనిపించకుండాపోయాడు. సోమవారం కోవెలకుంట్ల పోలీసుస్టేషన్‌లో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఆయన తెలిపారు.

గ్యాస్ సిలిండర్ల ఆటో బోల్తా

ఆళ్లగడ్డ, జూన్ 24: 40వ జాతీయ రహదారిలోని బత్తలూరు గ్రామం వద్ద ఆళ్లగడ్డ నుంచి నంద్యాలకు వెళ్తున్న గ్యాస్ సిలిండర్ల ఆటో అదుపు తప్పి సోమవారం బోల్తా పడింది. ఈ సంఘటనలో ఎవరూ ప్రమాదానికి గురి కాకపోవడంతో గ్రామ ప్రజలు ఊపిరి పీల్చుకున్నారు. ఈ సంఘటనపై రూరల్ పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు జరుపుతున్నారు.

హత్యా.. ఆత్మహత్యా?



బాబుప్రసాద్ (ఫైల్)

అవుకు, జూన్ 24 : నంద్యాల జిల్లా అవుకు పట్టణం ఈబీసీ కాలనీకి చెందిన బాయకాటి బాబుప్రసాద్ (20) మృతిపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. సోమవారం ఈ ఘటన జరిగింది. ఉదయం 11-30గంటల వరకు కుటుంబ సభ్యులతో కలసి తిరిగిన ప్రసాద్ మధ్యాహ్నం 12-30 గంటలకే రిజర్వాయర్‌లో దూకి మృతి చెందటం నమ్మశక్యంగా లేదని, తల వెనుక భాగంలో బలమైన గాయం ఉందని తల్లి వరలక్ష్మమ్మ రోదించారు. ఉదయం బాబుప్రసాద్ కుటుంబ సభ్యులు, ఇంటి పక్కన ఉన్న వారు ఇంటి స్థలం విషయంలో గొడవ పడి పోలీస్ స్టేషన్‌కు వెళ్లినట్లు స్థానికులు తెలిపారు. ఆ తర్వాత ఈ ఘటన జరిగినట్లు తెలుస్తోంది. పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం అవుకు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. తల్లి వరలక్ష్మమ్మ ఫిర్యాదు మేరకు దర్యాప్తు చేయనున్నట్లు ఎస్ఐ కిరణ్‌బాబు తెలిపారు.

ఇద్దరిపై కేసు నమోదు

కోవెలకుంట్ల, జూన్ 24 : కోవెలకుంట్ల పట్టణంలోని ముత్తూట్ ఫైనాన్స్‌లో నకిలీ బంగారు గాజులు తాకట్టు పెట్టి సుమారు రూ.8.54 లక్షల రుణం తీసుకొని మోసం చేసిన ఇద్దరు వ్యక్తులపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ వరప్రసాద్ తెలిపారు. సోమవారం ఆయన తెలిపిన వివరాల మేరకు.. ఉయ్యాలవాడ మండలం మాయలూరు గ్రామానికి చెందిన నక్కా లక్ష్మీనారాయణ, సంజామల మండలం పేరుసోముల గ్రామానికి చెందిన దూదేకుల అమీర్ కోవెలకుంట్ల పట్టణంలోని ముత్తూట్‌లో నకిలీ బంగారు గాజులు పెట్టి రుణం పొందారు. లక్ష్మీనారాయణ 23.5.2018లో నకిలీ బంగారు గాజులు పెట్టి రూ.1.73 లక్షలు, 25.5.2023న నకిలీ గాజులు పెట్టి రూ.1.90 లక్షలు రుణం తీసుకున్నాడు. అలాగే అమీర్ 5.7.2023న నకిలీ బంగారు గాజులు పెట్టి రూ.1.83,025లు, రెండోసారి 24.7.2023న నకిలీ బంగారు కడియం పెట్టి రూ.1,20,025 అప్పు తీసుకున్నారు. వీరు తాకట్టు పెట్టిన బంగారు గాజుల్లో శాతమే బంగారం ఉందని తేలాక బ్యాంకు మేనేజరు దూదేకుల మహబూబ్‌బాషా సోమవారం కోవెలకుంట్ల పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు ఇద్దరు వ్యక్తులపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేసినట్లు తెలిపారు.

శిలాఫలకం ధ్వంసం.. కేసు నమోదు

పాణ్యం, జూన్ 24 : మండలంలోని తమ్మరాజుపల్లెలోని హెల్త్ క్లినిక్ శిలాఫలకం ధ్వంసం చేసిన ఘటనలో కేసు నమోదు చేసినట్లు పాణ్యం ఎస్ఐ అశోక్ తెలిపారు. ఈ నెల 22వ తేదీ రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు హెల్త్ క్లినిక్ ప్రారంభోత్సవ శిలాఫలకాన్ని ధ్వంసం చేసి వాటిపై ముద్రించిన మాజీ ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి చిత్రాలను ధ్వంసం చేసినట్లు సర్పంచ్ విజయగౌరి సోమవారం ఫిర్యాదు చేశారన్నారు. సర్పంచ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

జర్నలిస్టుల పిల్లలకు 60 శాతం రాయితీ ఇవ్వాలి

జేసీకి ఏపీయూడబ్ల్యూజే నాయకుల వినతి



వినతి పత్రం ఇస్తున్న ఏపీయూడబ్ల్యూజే నాయకులు

కర్నూలు(కల్చరల్), జూన్ 24: వివిధ పత్రికలు, మీడియా సంస్థల్లో పని చేస్తున్న జర్నలిస్టుల పిల్లలకు ప్రైవేటు, కార్పొరేట్ విద్యాసంస్థల్లో 60 శాతం ఫీజు రాయితీ ఇవ్వాలని ఆంధ్రప్రదేశ్ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్స్ (ఏపీయూడబ్ల్యూజే) నాయకులు డిమాండ్ చేశారు. సోమవారం ఐజేయూ జాతీయ సమితి సభ్యులు గోరంట్ల కొండప్ప, కె.నాగరాజు, ఏపీయూడబ్ల్యూజే జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీనివాసగౌడ్, సహాయ కార్యదర్శి శివ, చిరంజీవి, హెచ్ఎం టీవీ స్టాఫ్ రిపోర్టర్ హరికిషన్ ఆధ్వర్యంలో కలెక్టరేట్‌లో జాయింట్ కలెక్టర్ నారపరెడ్డి మౌర్యను కలిసి వినతిపత్రం అందజేశారు. ఆమె తక్షణమే స్పందించి ఈ అంశంపై వెంటనే చర్యలు తీసుకోవాలని డీఈఓ శ్యామూల్‌ను ఆదేశించారు. ఈ సందర్భంగా ఏపీయూడబ్ల్యూజే నాయకులు మాట్లాడుతూ జర్నలిస్టుల పిల్లలకు ప్రైవేటు, కార్పొరేట్ విద్యాసంస్థల్లో 60 శాతం ఫీజు రాయితీ అందించి ఆదుకోవాలని కోరారు. అలాగే గత వైసీపీ ప్రభుత్వం జర్నలిస్టులకు ఇంటి స్థలాలు ఇస్తామని జీవో ఇచ్చిందని, ఈలోగా ఎన్నికల కోడ్ రావడంతో ఆగిపోయిందని అన్నారు. ఈ ప్రభుత్వంలోనైనా ఇంటి స్థలం, పక్కా ఇళ్లు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీనియర్ జర్నలిస్టులు అశోక్‌గౌడ్, అంజి, యల్లాగౌడ్, హుస్సేన్, ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియా ప్రతినిధులు పాల్గొన్నారు.

వెలుగులోకి మరో వైసీపీ అక్రమ కట్టడం



ఆదోనిలో అనుమతులు లేకుండా నిర్మించిన వైసీపీ కార్యాలయం

ఆదోని టౌన్, జూన్ 24: పట్టణంలోని ఎస్కేడీ కాలనీలో ఒకటో రోడ్డులో ఉన్న వైసీపీ కార్యాలయ భవనం మునిసిపల్ అనుమతులు లేకుండానే నిర్మించిన విషయం సోమవారం వెలుగులోకి వచ్చింది. 2021లో భవన నిర్మాణం కోసం ఆన్‌లైన్ ద్వారా ప్లాన్ దాఖలు చేసి, మొదటి విడత ఫీజుగా రూ.పది వేలు చెల్లించారు. ప్లాన్ మంజూరుకు అవసరమైన అన్ని డాకుమెంట్లు దాఖలు చేస్తూ మిగతా ఫీజు చెల్లించాల్సి ఉండగా అవేవి చేయకుండానే రెండు అంతస్తుల భవన నిర్మాణాన్ని పూర్తి చేశారు. అందులో వైసీపీ కార్యాలయం కూడా అర్భాటంగా ప్రారంభించారు. సోమవారం ఈ విషయం బయటికి పొక్కడంతో హడావుడిగా రెండో విడత ఫీజు చెల్లించారు. ప్లాన్ మంజూరు లేకుండా నిర్మాణం జరుగుతుంటే అధికారులు ఎందుకు చర్యలు తీసుకోలేదన్న విమర్శలు రావడంతో అధికారులపై కమిషనర్ మండిపడ్డారు. వైసీపీ కార్యాలయానికి అనుమతులు ఉన్నాయని, తనను తప్పుదోవ పట్టించిన ఏసీపీ పై శాఖా పరమైన చర్యల కోసం పై అధికారులకు నివేదిస్తూ, ఈ విషయంలో నిర్లక్ష్యం వహించిన వార్డు ప్లానింగ్ సెక్రెటరీను తక్షణం సస్పెండ్ చేయాలని ఆదేశించామని, ప్లాన్ వేసిన ఎల్టీపీ లైసెన్సును రద్దు చేస్తున్నట్లు కమిషనర్ రామచంద్ర రెడ్డి తెలిపారు. అక్రమ నిర్మాణంగా భావించి భావనన్ని సీజ్ చేస్తామని తెలిపారు.

చోరీ కేసును ఛేదించిన పోలీసులు

కౌతాళం, జూన్ 24: మండల పరిధిలోని వల్లూరు గ్రామంలో ఆదివారం రాత్రి జరిగిన చోరి కేసును 24 గంటలు గడవ మునుపే కౌతాళం పోలీసులు ఛేదించారు. చోరీ సొమ్మును స్వాధీనం చేసుకున్నారు. నిందితుడిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. ఎస్ఐ నరేంద్ర కుమార్ రెడ్డి తెలిపిన వివరాల మేరకు.. మండల పరిధిలోని వల్లూరు గ్రామానికి చెందిన దేవన్నగౌడ్ సోమవారం తన ఇంటి మిద్దె మీద నిద్రించగా రాత్రి ఎవరో గుర్తు తెలియని వ్యక్తులు తమ ఇంటి తలుపులు పగలగొట్టి ఇంట్లో ఉన్న ఐదు తులాల బంగారు అభరణాలు, రెండు సెల్‌ఫోన్లను దొంగలించినట్లు ఫిర్యాదు చేశాడు. సాంకేతిక పరిజ్ఞానంతో హెడ్‌కానిస్టేబుల్ సోమ్లా నాయక్ పీసీలు వీరాంజనేయులు, నరేంద్ర, మద్దిలేటి, వీరేష్, వీరభాస్కర్‌లు చాకచక్యంగా వ్యవహరించి నిందితుడు వాసయ్య గారి ఈరన్నను అరెస్ట్ చేశారు. నిందితుడి వద్ద నుంచి దొంగలించిన ఐదు తులాల బంగారు అభరణాలు, రెండు సెల్‌ఫోన్లను, ఇనుప రాడ్‌ను స్వాధీనం చేసుకుని నిందితున్ని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు.

మల్లన్న సన్నిధిలో తెలంగాణ మంత్రులు




ఆలయ ప్రాంగణంలో తెలంగాణ మంత్రులు, ఎమ్మెల్యేలు

శ్రీశైలం, జూన్ 24: శ్రీశైల భ్రమరాంబ మల్లికార్జున స్వామి, అమ్మవార్లను సోమవారం తెలంగాణ రాష్ట్రం డిప్యూటీ సీఎం మల్లుభట్టి విక్రమార్క దంపతులు, మంత్రి జూపల్లి కృష్ణారావు, ఎమ్మెల్యేలు వంశీకృష్ణ, రాజేష్, కసిరెడ్డి నారాయణరెడ్డి, యెన్నం శ్రీనివాసరెడ్డి దర్శించుకున్నారు. దర్శనార్థం ఆలయ రాజగోపురం వద్దకు చేరుకున్న వీరికి ఆలయ కార్యనిర్వహణాధికారి డి. పెద్దిరాజు, అర్చకులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. అనంతరం మంత్రులు, ఎమ్మెల్యేలు స్వామివారికి అభిషేకం నిర్వహించుకుని అనంతరం భ్రమరాంబికాదేవి అమ్మవారికి కుంకుమార్చన చేశారు. దర్శనానంతరం అమ్మవారి ఆలయ ప్రాంగణంలోని ఆశీర్వచన మండపంలో వేదపండితులు వీరికి వేదాశీర్వచనం పలికి తీర్థప్రసాదాలను అందజేశారు. అనంతరం డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క విలేకరులతో మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రానికి శ్రీశైలం జలవిద్యుత్ ఉత్పత్తి అత్యంత ముఖ్యమైనదని అన్నారు. జలవిద్యుత్ ఉత్పత్తిపై సమీక్ష నిర్వహించడానికి వచ్చినట్లు తెలిపారు. తెలంగాణ రాష్ట్రానికి 2029-30 వరకు విద్యుత్ కొరత లేకుండా ప్రణాళికతో వ్యవహరిస్తున్నట్లు తెలిపారు.

ధరల నియంత్రణకు చర్యలు చేపట్టండి

జాయింట్ కలెక్టర్ రాహుల్‌కుమార్‌రెడ్డి



అధికారులతో సమీక్ష నిర్వహిస్తున్న జేసీ

నంద్యాల (కల్చరల్), జూన్ 24: కూరగాయలు, నిత్యావసర వస్తువులు ధరల పెరుగుదలను నియంత్రించేందుకు చర్యలు చేపట్టాలని జాయింట్ కలెక్టర్ రాహుల్‌కుమార్‌రెడ్డి సంబంధిత అధికారులను ఆదేశించారు. సోమవారం ఆయన చాంబర్‌లో ధరల నియంత్రణపై సంబంధిత అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సమావేశంలో డీఆర్వో పద్మజ, మార్కెటింగ్ ఏడీ అబ్దుల్ రెహమాన్, ఉద్యానశాఖ అధికారి నాగరాజు, డీఎస్‌ఓ వెంకటరాముడు, వ్యవసాయ అనుబంధ శాఖల అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ టి.రాహుల్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ రైతులకు లాభదాయకంగా ఉండటంతో పాటు వినియోగదారులకు సరసమైన ధరలకు కూరగాయలు అందించే సరఫరాదారులను గుర్తించి నివేదిక అందజేయాలని అన్నారు. హార్టికల్చరల్ డిపార్ట్‌మెంట్ డాటా ప్రకారం స్థానిక కూరగాయల రైతుల నుంచి కారగాయల లభ్యత, ఎస్టేట్ ఆఫీసర్లు, డ్వాక్రా గ్రూపుల ద్వారా రైతు బజార్లలో విక్రయించడం వంటి అంశాలపై సమగ్ర సమాచారం అందజేయాలని సూచించారు. సమీప హోల్‌సేల్ మార్కెట్లు, ఇతర జిల్లాల నుంచి టమోటా సేకరణ మరియు ధరల వివరాలతో నివేదిక అందజేయాలని ఆదేశించారు. నిర్దేశిత మార్గదర్శకాల ప్రకారం ఉద్యానవన, పౌర సరఫరాలు, మార్కెటింగ్ అధికారులు బృందాలుగా ఏర్పడి తనిఖీలు చేయాలని జేసీ ఆదేశించారు. తనిఖీల సమయంలో ఎదురైన సమస్యలు, పరిష్కారాలతో నివేదికలు ఇవ్వాలని జాయింట్ కలెక్టర్ ఆదేశించారు.

కర్నూలు ఎయిర్ పోర్ట్ డైరెక్టర్ రాజీనామా

కర్నూలు, జూన్ 24 (ఆంధ్రజ్యోతి): కర్నూలు (ఓర్వకల్లు) ఎయిర్ పోర్ట్ డైరెక్టర్ రణజిత్‌సింగ్ ప్రతాప్‌సింగ్ హజారే తన పదవికి రాజీనామా చేశారు. రాజీనామాను ఏపీ ప్రభుత్వం ఈ నెల 21న ఆమోదించింది. గత వైసీపీ ప్రభుత్వంలో ఈయనను కర్నూలు ఎయిర్‌పోర్ట్ డైరెక్టరుగా నియమించారు. ప్రభుత్వం మారడంతో తన పదవికి రాజీనామా చేశారు. కర్నూలు ఎయిర్‌పోర్ట్ యూనిట్ హెడ్ సెక్యూరిటీ విద్యాసాగర్‌కు తదుపరి ఉత్తర్వులు వచ్చే వరకు పూర్తి అదనపు బాధ్యతలు అప్పగించారు. రాజీనామా చేసిన రణజిత్ ప్రతాప్‌సింగ్ హజారే ఏపీఏడీసీఎల్ సీఈఓకు చార్జ్ అప్పగించాలని ఆ ఉత్తర్వులో పేర్కొన్నారు.

న్యాయం చేయాలంటూ టవర్ ఎక్కిన యువకుడు

పాణ్యం, జూన్ 24 : పాణ్యం అయ్యపురెడ్డి కాలనీకి చెందిన కమలపురి శ్రీనివాసులు సోమవారం సమీప సెల్‌టవర్ ఎక్కి ఆత్మహత్యకు యత్నించాడు. పోలీసులు రంగంలోకి దిగి శ్రీనివాసులును టవర్ నుంచి కిందికి దించారు.

వైసీపీ నాయకులపై ఎస్సీ, ఎస్టీ కేసు నమోదు

గడివేముల, జూన్ 24: మండలంలోని ఆళ్లగడ్డ గ్రామానికి చెందిన వైసీపీ నాయకులపై ఎస్సీ, ఎస్టీ కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ బీటీ వెంకటసుబ్బయ్య తెలిపారు. గ్రామానికి చెందిన అరవింద్, అతడి స్నేహితులు చర్చి వద్ద ఆదివారం సాయంత్రం కూర్చొని ఉండగా అదే గ్రామానికి చెందిన చంద్రతో వాగ్వివాదం జరిగింది. ఈ ఘటనపై గ్రామానికి చెందిన లక్ష్మీరెడ్డి వారిని బెదిరించారు. అరవింద్ బావ విజయ్ సోమవారం లక్ష్మీరెడ్డికి ఫోన్ చేసి తమ వాళ్లను ఎందుకు బెదిరించారని అడుగగా ఇంటి వద్దకు వచ్చి మాట్లాడమని చెప్పారు. దీంతో అరవింద్, విజయ్, విజయ్ మామ గంటపోగు తిరుపాల్ వైసీపీ నాయకుల ఇంటి వద్దకు వెళ్లగా తమకే ఫోన్ చేసేంత పెద్దవాడివయ్యావా అంటూ కులం పేరుతో దూషించి వైసీపీ నాయకులు లక్ష్మీరెడ్డి, సర్వేశ్వర్‌రెడ్డి, మోహన్‌రెడ్డి, వెంకటేశ్వర్‌రెడ్డి, నాగార్జున్‌రెడ్డి, అబ్బాస్, రమణారెడ్డి, మల్లారెడ్డిలు ముగ్గురిపై దాడి చేశారు. బాధితుడు తిరుపాల్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు 8 మందిపై అట్రాసిటీ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

విజేతలు నంద్యాల జిల్లా ఎద్దులు



రాతిదూలం లాగుతున్న ఎద్దులు

సంజామల, జూన్ 24 : నొస్సం గ్రామంలో జరిపిన బుగ్గ వెంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా సోమవారం నిర్వహించిన రాష్ట్ర స్థాయి బండ లాగుడు పోటీలలో నంద్యాల జిల్లా గుంపరమాను దిన్నె రాంభూపాల్ రెడ్డి ఎద్దులు మొదటి విజేతగా నిలిచి రూ 80000 నగదు బహుమతిని గెలుచుకున్నాయి. సీనియర్ విభాగంలో హోరాహోరీగా జరిగిన పోటీలలో రాష్ట్ర నలమూలాల నుండి పోటీలలో ఎద్దులు పాల్గొన్నాయి. ద్వితీయ స్థానంలో నంద్యాల జిల్లా పెద్ద కొట్టాలకు చెందిన బోరెడ్డి కేశవ రెడ్డి, కంబైండ్ పురుషోత్తమ్ రెడ్డి ఎద్దులు మూడో స్థానంలో, కడప జిల్లా మైదుకూరుకు చెందిన కెవియస్ బుల్స్ కుర్రా వెంకటేశ్ యాదవ్, 4వ స్థానంలో వైఎస్ఆర్ జిల్లా చౌటుపల్లెకు చెందిన వార్తల చంద్ర ఓబుల్ రెడ్డి ఎద్దులు, 5వ స్థానంలో అనంతపురం జిల్లా గార్లదిన్నెకు చెందిన రామాంజినేయులు ఎద్దులు, 6వ స్థానంలో వైఎస్సార్ జిల్లా బాలుగారి పల్లెకు చెందిన ఇందిరెడ్డి రమణా రెడ్డి ఎద్దులు, 7వ స్థానంలో నంద్యాల జిల్లా మూడురాళ్ల పల్లెకు చెందిన పులి చిన్న ఓబుల్ రెడ్డి ఎద్దులు, 8వ స్థానంలో వైఎస్ఆర్ జిల్లాకు చెందిన వైఎంఆర్ కాలనీకి చెందిన గురివి రెడ్డి ఎద్దులు, 9వ స్థానంలో అనంతపురం జిల్లా గార్లదిన్నెకు చెందిన కె రమేష్ ఎద్దులు విజేతలుగా నిలిచాయి. ఈ ఎద్దుల యజమానులకు రూ.80000, రూ 60000, రూ 50000, రూ.40000, రూ.30000, రూ.20000, రూ.12000, రూ.10000 ప్రోత్సాహ నగదును ఆలయ కమిటీ వారు అందజేశారు.

ముడుమలగుర్తిలో చోరీ

● నగదు, ఆభరణాల అపహరణ

కోడుమూరు (రూరల్), జూన్ 24: మండలంలోని ముడుమలగుర్తిలో భారీ చోరీ జరిగింది. తాళం వేసిన ఇంట్లో దుండగులు చొరబడి నగదు, నగలు ఎత్తుకెళ్లారు. గ్రామానికి చెందిన రాధాక్రిష్ణారెడ్డి, శోభావతి దంపతులు గత శనివారం సాయంత్రం ఇంటికి తాళం వేసి తిరుమల బయల్దేరారు. అయితే సోమవారం ఉదయం ఇంటి ముందు కళ్లాపి చల్లి ముగ్గు వేయడానికి వెళ్లిన మహిళకు ఇంటి తాళం పగలగొట్టి కనిపించింది. దీంతో ఆందోళన చెందిన సదరు మహిళ ఇరుగుపొరుగు వారిని పిలిచి విషయం తెలిపింది. వారి సాయంతో గృహ యజమానికి సమాచారం అందించారు. యజమాని ఫోన్లో పోలీసులకు విషయం తెలపడంతో పోలీసులు చేరుకుని పరిశీలించారు. క్లూస్ టీం, డాగ్ స్క్వాడ్‌లను రప్పించి పరిశోధించారు. సాయంత్రం చేరుకున్న యజమాని రాధాక్రిష్ణారెడ్డి, శోభావతి దంపతులు తమ ఇంట్లో రూ 2.5 లక్షల నగదు, 6 తులాలు బంగారు, 20 తులాల వెండి ఆభరణాలు చోరికి గురైనట్లు తెలిపారు. వారి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

సినిమా వాళ్లని తక్కువగా చూడకండి

● పవన్ ధైర్యమే ఆయనకు గెలుపును అందించింది

● సినీ నటుడు సుమన్



విలేకర్లతో మాట్లాడుతున్న సుమన్

పత్తికొండ,జూన్24: సినిమా వాళ్లకు రాజకీయం ఏం తెలుస్తుందని తక్కువగా చూడవద్దని సినీ నటుడు సుమన్ అన్నారు. సోమవారం పత్తికొండలో ఆయన విలేకర్లతోమాట్లాడుతూ సినిమా వాళ్లకు ఏమీ తెలియదని అనడం సరి కాదని, దీనికి ఎన్నో ఉదాహరణలు ఉన్నాయని అన్నారు. సంకల్ప బలంతో రాజకీ యా ల్లోకి వచ్చిన సినీనటులు ఎందరో రాజకీయప్రభంజనం సృష్టించారని అన్నారు. తమిళనాడులో ఎంజీఆర్, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో ఎన్టీఆర్ ఎలాంటి రాజకీయ అనుభవం లేకపోయినా ప్రజలకు మంచి చేయాలన్న ఉద్దేశంతో పార్టీలు స్థాపించి ప్రజల మనసులు గెలుచుకున్నారన్నారు. రాజకీయాల్లోకి వచ్చిన పవన్‌కళ్యాణ్‌ను ఎన్నోవిధాలుగా అవమానాలకు గురిచేశారన్నారు. అదేవి ధంగా పవన్‌కు మొదటిసారి ఓటమి ఎదురైనా, అవమానాలకు భయపడక ప్రజల్లోకి మరోసారి ధైర్యంగా వెళ్లి విజయం సాధించి విమర్శకుల నోరు మూయిం చాడన్నారు. నిబంధనల సడలింపు విషయంలో ప్రభుత్వాలు ముం దుకు రాకపోవడంతో చిన్న సినిమా చితికిపోయే పరిస్థితి ఏర్పడిందని అన్నారు. గతం లో హైదరాబాద్ అభివృద్ధి కోసం ప్రణాళికలు వేసిన చంద్రబాబు నేడు అమరా వతిని అభివృద్ధికి ప్రణాళికలు అమరావతిని దేశంలోనే అందమైన రాజధానిగా తీర్చిదిద్దాలని అన్నారు.

మహిళ ఆత్మహత్య

బనగానపల్లె , జూన్ 24 : బనగానపల్లె పట్టణానికి చెందిన ఎరుకలి సీతా మహాలక్ష్మి (22) కడుపుకోప్పి భరించలేక జీవితంపై విరక్తి చెంది ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకుంది. ఇంట్లో ఎవ్వరూ లేని సమయంలో ఉరివేసుకున్నట్లు సీఐ గంటా సుబ్బారావు సోమవారం తెలిపారు. మృతదేహాన్ని బనగానపల్లె ప్రభుత్వ వైద్యశాలకు తరలించి పోస్టుమార్టం నిర్వహించినట్లు తెలిపారు. మృతురాలి తల్లి సుంకమ్మ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

అర్జీలకు సత్వర పరిష్కారం చూపాలి



అర్జీలు స్వీకరిస్తున్న ఇన్‌చార్జి కమిషనర్

కర్నూలు(న్యూసిటీ), జూన్ 24: ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం ద్వారా వచ్చే ఫిర్యాదులకు సత్వర పరిష్కారం చూపాలని ఇన్‌చార్జి కమిషనర్ పీవీ రామలింగేశ్వర్ అధికారులను ఆదేశించారు. సోమవారం నగర పాలక సంస్థ కార్యాలయంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని నిర్వహించారు. టిడ్కో, పింఛన్ మంజూరు, ప్రణాళిక విభాగాలకు సంబంధించి పలు ఫిర్యాదులు వచ్చాయి. ఎంఈ శేషసాయి, ఇన్‌చార్జి డీసీపీ సంధ్య, ఆరోగ్యాధికారి కే.విశ్వేశ్వరరెడ్డి, మేనేజర్ చిన్నరాముడు, ఆర్ఓ జునైద్, టిడ్కో అధికారి పెంచలయ్య పాల్గొన్నారు.

ప్రజా సమస్యలు పరిష్కరించండి



తహసీల్దార్‌కు వినతిపత్రం ఇస్తున్న ఆర్‌పీఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి

ఓర్వకల్లు, జూన్ 24: ప్రజా సమస్యలను వెంటనే పరిష్కరించాలని తహసీల్దార్ నటరాజ్, ఎంపీడీవో మల్లేశ్వరి అన్నారు. సోమవారం ఓర్వకల్లులోని తహసీల్దార్ కార్యాలయంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక ద్వారా ప్రజల నుంచి వచ్చిన అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అర్జీలను సంబంధిత అధికారులు పరిశీలించి వాటిని వెంటనే పరిష్కరించాలన్నారు. ఈవో ఆర్‌డీ సుబ్బరాయుడు, హౌసింగ్ ఏఈ రామయ్య, ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.

కుల ధ్రువీకరణ పత్రాలు ఇవ్వాలి: విద్యార్థులకు కుల ధ్రువీకరణ, ఆదాయ పత్రాలను ఇవ్వాలని ఆర్‌పీఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రవీంద్రనాథ్ కోరారు. సోమవారం తహసీల్దార్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ఆయన వినతి పత్రం అందజేశారు. నాయకుడు బండారు వెంకటేశ్, చంద్రశేఖర్, మధు, పాల్గొన్నారు.

సి.బెళగల్: మండల కేంద్రమైన సి. బెళగల్‌లో సోమవారం నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల సేకరణ వేదికలో రైతులు, ప్రజలు ఆన్‌లైన్, అడంగల్, స్థలాల సమస్యలపై ఫిర్యాదులు వచ్చినట్లు తహసీల్దార్ అనుపమ తెలిపారు. ఈ కార్యక్రమానికి ఎంపీడీవో శకుంతల, ఈవోఆర్డీ సందీప్, హౌసింగ్ ఏఈ సుమంత్, ఏవో మల్లేష్ కుమార్, అంగన్‌వాడీ సూపర్‌వైజర్ పద్మావతమ్మ హాజరయ్యారు.

కాంగ్రెస్ పార్టీలో కమిటీల రద్దు

కర్నూలు(అర్బన్), జూన్ 24: కాంగ్రెస్‌లో కమిటీలను పీసీసీ రద్దు చేసినట్లు జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయ వర్గం పేర్కొంది. గ్రామ స్థాయి నుంచి జిల్లా కేంద్రంలోని డీసీసీ వరకు అన్ని కమిటీలను పీసీసీ రద్దు చేసిందని, ఆ మేరకు నూతన కార్యవర్గం ఏర్పాటుకు కసరత్తు జరుగుతుందని పేర్కొంది. కొత్త కార్యవర్గం ఏర్పాటయ్యే వరకు పాత కార్య వర్గం తాత్కాలికంగా కొనసాగుతుందని డీసీసీ బాబురావు పేర్కొనట్లు కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షుడు బతుకన్న తెలిపారు.

నేడు సి. క్యాంపు రైతుబజారులో

క్లీన్ అండ్ గ్రీన్

కర్నూలు(అగ్రికల్చర్), జూన్ 24: సి.క్యాంపు రైతుబజారులో ప్రతి నెలా క్లీన్ అండ్ గ్రీన్ కార్యక్రమాన్ని అమలు చేస్తున్నట్లు ఎస్టేట్ అధికారి హరీష్ కుమార్, ఉద్యాన వన శాఖ అసిస్టెంట్ శివకుమార్ తెలిపారు. ఇందులో భాగంగా మంగళవారం సి.క్యాంపు రైతుబజారులో పరిశుభ్రత కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని తెలిపారు. రైతులు మంగళవారం రైతుబజార్‌కు కూరగాయలు తీసుకునిరావద్దని వారు సూచించారు.

ఆరోపణలు తగదు

కర్నూలు(న్యూసిటీ), జూన్ 24: మాజీ మంత్రి మారెప్ప తనపై నిరాధారమైన ఆరోపణలు చేయడం తగదని గూడూరు మండల టీడీపీ అధ్యక్షుడు సుధాకర్‌రెడ్డి అన్నారు. సోమవారం నగరంలోని ఓ హోటల్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ మాజీ మంత్రి మారెప్ప తనపై చెక్కులు దొంగతనం చేశారని, కర్నూలు మూడో పట్టణ పోలీస్ స్టేషన్‌లో తప్పుడు కేసు పెట్టారని అన్నారు. తాను నిజంగా తప్పు చేసి ఉంటే ఏ శిక్షకైనా సిద్ధంగా ఉన్నానని సవాల్ విసిరారు. తనపై ఎస్సీ, ఎస్టీ కేసు నమోదు చేయడం సరికాదని, వ్యాపార లావాదేవీల భాగం గానే మారెప్ప చెక్కులు ఇచ్చినట్లు ఆయన వివరించారు. అనంతరం టీడీపీ జిల్లా అధికార ప్రతినిధి సుందర్‌రాజ్ మాట్లాడుతూ సుధాకర్‌రెడ్డి తప్పు చేయకున్న మారెప్ప ఎస్సీ, ఎస్టీ కేసు నమోదు చేయడం సరికాదన్నారు. సుధాకర్‌రెడ్డి తప్పు చేసినట్లు రుజువైతే మారెప్పకు మద్దతుగా తాను ఉంటానని అన్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉన్నాం

- అంటువ్యాధుల విభాగానికి 20 పడకలు
- సూపరింటెండెంట్ డాక్టర్ సి.ప్రభాకర్ రెడ్డి

కర్నూలు(హాస్పిటల్), జూన్ 24: సీజనల్ వ్యాధులైన గ్యాస్ట్రో, మలేరియా, డెంగీ వ్యాధులపై అప్రమత్తంగా ఉన్నామని కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాల సూపరింటెండెంట్ డాక్టర్ సి.ప్రభాకర్ రెడ్డి తెలిపారు. సోమవారం సూపరింటెండెట్ చాంబరులో ఆయన వైద్యులతో సీజనల్ వ్యాధులపై సమీక్ష నిర్వహించారు. అందులో భాగంగా ఆసుపత్రిలోని పాత 24 గంటల ల్యాబ్‌లో అంటువ్యాధుల విభాగం (ఐడీ వార్డు)ను ఏర్పాటు చేస్తున్నామని, మగవారికి 10 పడకలు, ఆడవారికి 10 పడకలు సిద్ధం చేస్తున్నామని అన్నారు. ఐడీ వార్డులో అవసరమైన లైట్లు, ఫ్యాన్లు, వైరింగ్ పనులను పూర్తి చేయాలని సూపరింటెండెంట్ ఆదేశించారు. అలాగే ఐడీ వార్డులో అవసరమైన హెడ్‌నర్సు, స్టాఫ్ నర్సులు, నర్సింగ్ విద్యార్థులను వేయాలని నర్సింగ్ సూపరింటెండెంట్ సావిత్రీబాయిని ఆదేశించారు. ప్లేట్‌లెట్ల కోసం పీఆర్‌పీలు అందుబాటులో స్టాక్ ఉంచుకోవాలని బ్లడ్ బ్యాంకు మెడికల్ ఆఫీసర్‌ను ఆదేశించారు. సమీక్షలో ఆసుపత్రి సీఎస్ ఆర్ఎంవో వెంకటేశ్వరరావు, మెడిసిన్ ప్రొఫెసర్ ఎస్. లక్ష్మీబాయి, ఐడీ వార్డు ఇన్‌చార్జి ప్రొఫెసర్ బ్లెస్సీ మనోహర్, ఏఆర్ఎంవో వెంకటరమణ, బ్లడ్ బ్యాంకు అసిస్టెంట్ ప్రొఫెసర్ వై.శ్రీధర్, నర్సింగ్ సూపరింటెండెంట్ సావిత్రీబాయి, ఫార్మసిస్టు గ్రేడ్-1 నరసింహరావు పాల్గొన్నారు.

● **ఫార్మసీ మాడ్యుల్‌ను అమలు చేయాలి:** ఆసుపత్రిలో త్వరలో ఫార్మసీ మాడ్యుల్‌ను పూర్తి స్థాయిలో అమలు చేయనున్నట్లు ఆసుపత్రి సూపరింటెండెంట్ సి.ప్రభాకర్ రెడ్డి తెలిపారు. కర్నూలు జీజీహెచ్ ధన్వంతరీ హాలులో పలు విభాగాల్లో ఉండే ఫార్మసిస్టులతో ఆయన ఫార్మసీ మాడ్యుల్ ఈ-హాస్పిటల్ ఇంప్లిమెంటేషన్ నమోదుపై మాక్‌డ్రిల్ నిర్వహించారు. రోగికి సంబంధించిన మందులు ఆన్‌లైన్‌లో నమోదు చేసి దానికి సంబంధించిన ఫార్మసిస్టులకు మందులు ఎలా ఎంట్రీ చేయాలన్న దానిపై స్పెషల్ శిక్షణ తరగతులను నిర్వహించారు. కార్యక్రమంలో స్టోర్ మెడికల్ ఆఫీసర్ శారద, హాస్పిటల్ అడ్మినిస్ట్రేటర్స్ శివబాల, ఫార్మసిస్టు గ్రేడ్-1 నరసింహులు, ఎన్‌సీఐ కోఆర్డినేటర్ సురేష్ పాల్గొన్నారు.



వైద్యులతో మాట్లాడుతున్న సూపరింటెండెంట్

వృద్ధులకు ఆర్థో ఓపీలోనే మందులు: వృద్ధులు, నడవలేని స్థితిలో ఉన్న రోగులకు ఆర్థో ఓపీ విభాగంలోనే మందులు ఇస్తామని కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాల సూపరింటెండెంట్ సి.ప్రభాకర్ రెడ్డి తెలిపారు. సోమ వారం ఉదయం ఆయన సీఎస్ఆర్ఎంవో వెంకటేశ్వరరావుతో కలిసి ఆసుపత్రిలోని ఓపీ విభాగాలను కౌంటర్లను పరిశీలించారు. ఆర్థో ఓపీ విభాగంలో నడవలేని రోగుల కోసం అక్కడే మందులు ఇచ్చే విధంగా చూడాలని ఆర్థో వైద్యులకు ఫార్మసీ అధికారులు, నర్సింగ్ సూపరింటెం డెంట్‌ను ఆదేశించారు. సూపరింటెండెంట్ వెంట సీఎస్ఆర్ఎంవో వెంక టేశ్వరరావు, ఆర్థో విభాగాధిపతి డాక్టర్ కే.శ్రీనివాస్, ఆరోగ్యశ్రీ కోఆర్డినేటర్ వెంకటరమణ, హాస్పిటల్ అడ్మినిస్ట్రేటర్లు శివబాల, చీఫ్ ఫార్మసీ ఆఫీసర్ బి.నరసింహరావు, నర్సింగ్ సూపరింటెండెంట్ సావిత్రీబాయి పాల్గొన్నారు.

లోకేశ్‌ను కలిసిన మంత్రి టీజీ భరత్



లోకేశ్‌కు పుష్పగుచ్ఛం ఇస్తున్న మంత్రి టీజీ భరత్

కర్నూలు (అర్బన్), జూన్ 24: రాష్ట్ర ఐటీ, విద్యా, ఆర్టీజీల శాఖ మంత్రిగా బాధ్యతలు చేపట్టిన నారా లోకేశ్‌ను పరిశ్రమల శాఖ మంత్రి టీజీ భరత్ కలిశారు. మంగళవారం సచివాలయంలోని నారా లోకేశ్ చాంబర్లో మంత్రి టీజీ భరత్ కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

మహిళల రక్షణకు భరోసా

జిల్లా టీడీపీ మహిళా అధ్యక్షురాలు ముంతాజ్



కర్నూలు(అర్బన్), జూన్ 24: మహిళలకు తెలుగుదేశం ప్రభుత్వంలో పూర్తి స్థాయి రక్షణకు భరోసా కలిగిందని జిల్లా టీడీపీ మహిళా అధ్యక్షురాలు షేక్ ముంతాజ్ అన్నారు. మంగళవారం జిల్లా టీడీపీ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ రాష్ట్ర హోం మంత్రిగా బాధ్యతలు తీసుకున్న వంగలపూడి అనిత 36 గంటల్లోనే కేసులో నిందితులను అరెస్టు చేయడం అభినందనీయమన్నారు. చీరాల మండలం ఈపూరు పాలెంలోని సీతారాంపేటకు చెందిన ఓ యువతిపై హత్యాచారం చేసిన నిందితులను గుర్తించి పట్టుకోవడం, తక్షణమే బాధిత కుటుంబానికి రూ. 10లక్షల ఆర్థిక సాయం చేసినందుకు కృతజ్ఞతలు తెలిపారు. మహిళలపై అఘాయిత్యాలు, దాడుల విషయంలో వేగంగా స్పందించాలని, కఠినంగా వ్యవహరించాలని సీఎం చంద్రబాబు సూచించడం హర్షించదగ్గ విషయమన్నారు.

నంద్యాల మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్‌గా రేణుకాదేవి

కర్నూలు(హాస్పిటల్), జూన్ 24: నంద్యాల మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్‌గా మైక్రోబయాలజి ప్రొఫెసర్ ఎ.రేణుకాదేవిని నియమిస్తూ వైద్యఆరోగ్యశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ కృష్ణబాబు ఉత్తర్వులు జారీ చేశారు. డాక్టర్ ఎ.రేణుకాదేవి కర్నూలు మెడికల్ కాలేజీలో మైక్రోబయాలజీ విభాగపు హెచ్‌వోడీతోపాటు వైస్ ప్రిన్సిపాల్‌గా విధులు నిర్వహిస్తున్నారు. రేణుకాదేవికి వైద్య ఆరోగ్యశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ అడిషనల్ డీఎంఈగా పదోన్నతి కల్పించి నంద్యాల మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్‌గా నియమించారు.

1న ఎన్టీఆర్ భరోసా పింఛన్

కర్నూలు(కలెక్టరేట్), జూన్ 24: ఎన్టీఆర్ భరోసా పెన్షన్ పథకం ద్వారా జూలై 1న సచివాలయ సిబ్బంది పెన్షనర్లకు పింఛన్ ఇవ్వనున్నారు. జిల్లాలో వృద్ధాప్య పింఛన్లు 1,26,152, వితంతు 71,519, వికలాంగుల 31,510, చేనేత కార్మికుల 2,948, కల్లుగీత కార్మికుల 242, హిజ్రాల 241, ఒంటరి మహిళ 5,883, మత్స్యకార్మికుల పింఛన్లు 817, సీకేడీయు (ప్రభుత్వ) 127, సీకేడీయు (ప్రైవేటు) 245, కిడ్నీ, దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులు 787, డప్పు కళాకారుల పింఛన్లు 1,457, చర్మకారుల 1,142, సైనిక్ వెల్ఫేర్ పింఛన్లు 6, కళాకారుల 39, అభయ పింఛన్లు 2,572 ఉన్నాయి.

సమగ్ర శిక్ష ఏపీసీ బదిలీ

కర్నూలు(ఎడ్యుకేషన్), జూన్ 24: జిల్లా సమగ్ర శిక్ష ఏపీసీగా పని చేస్తున్న విజయ జ్యోతి కుమారి మాతృ సంస్థకు బదిలీ అయ్యారు. ఖాళీ ఏర్పడిన పోస్టులో జిల్లా విద్యాశాఖ అధికారి శామ్యూల్‌కు ఎస్ఎస్ఏ ఏపీసీగా అదనపు బాధ్యతలను అప్పగించారు. ఈ మేరకు డీఈవో శామ్యూల్ సోమవారం ఉద్యోగ బాధ్యతలు స్వీకరించారు. కార్యాలయంలోని అధికారులకు, స్టాఫ్‌కు బాగా పని చేసి మంచి పేరు తీసుకురావాలని డీఈవో తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏడీ శ్రీనివాసులు, శ్యామ్యూల్ పాల్, సూపరింటెండెంట్లు కోటేశ్వరరావు, కోఆర్డినేటర్లు సాయి, అల్లాబకాష్, బలరామిరెడ్డి, పాల్గొన్నారు.

హాస్టల్‌లో మౌలిక సదుపాయాలు కల్పించాలి

కర్నూలు(కలెక్టరేట్), జూన్ 24: నగరంలోని ఇందిరాగాంధీ నగర్‌లో ఉన్న ఎస్సీ హాస్టల్‌లో మౌలిక సదుపాయాలు కల్పించాలని కోరుతూ ప్రజా సమస్యల పరిష్కర వేదిక కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా అధక్షుడు రంగప్ప, కార్యదర్శి అబ్దుల్లా సోమవారం జాయింట్ కలెక్టర్ నారపురెడ్డి మౌర్యకు వినతి పత్రం అందజేశారు. విద్యార్థులకు భోజనం, తాగునీరు, తదితర వసతులు కల్పించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు వీరేష్, రాజు, అంజి తదితరులు పాల్గొన్నారు.

పొదుపు సంఘాలు, బుక్ కీపర్లకు అవగాహన సదస్సు

కర్నూలు(న్యూసిటీ), జూన్ 24: ఇండియన్ బ్యాంకు, స్వయం సహాయక సంఘం రుణాల శాఖ, కర్నూలు ఆధ్వర్యంలో సోమవారం పొదుపు సంఘాల సభ్యులకు, సీసీలు, బుక్ కీపర్లకు ఇండియన్ బ్యాంకు ఇచ్చే రుణ సౌకర్యాలు, వడ్డీ రేట్లు, ఇతర రాయితీలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సమావేశంలో బ్రాంచ్ మేనేజర్ శృతి, బ్యాంకు మేనేజర్లు రాజశేఖర్, మురళీ మోహన్ రెడ్డి, నరేష్, మెప్మా సిటీ మిషన్ మేనేజర్ జి.మురళి, టౌన్ మిషన్ కోఆర్డినేటర్లు సుధాకర్, విజయభారతి, సిబ్బంది పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

కర్నూలు(న్యూసిటీ), జూన్ 24: సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని మలేరియా అసిస్టెంట్ డైరెక్టర్ త్యాగరాజు అన్నారు. కొత్తపేట, రోజా వీధిలలో డెంగీ కేసులను గుర్తించడంతో సోమవారం సీనియర్ ఎంటమాలజిస్టు వెంకటేశ్వర్లుతో కలిసి సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎప్పటికప్పుడు ఏఎన్ఎంలు, ఆరోగ్య సిబ్బంది కాలువలను శుభ్రం చేయించడం, నీటి నిల్వలు ఉండకుండా చూసుకోవాలని సూచించారు. ఆయన వెంట ఎంపీహెచ్ఈఓ నిత్యపూజయ్య, ఏఎంఓ చంద్రశేఖర్ ఉన్నారు.

సీజనల్ వ్యాధులు ప్రబలకుండా చర్యలు తీసుకోవాలి: సీజనల్ వ్యాధులు ప్రబలకుండా చర్యలు తీసుకోవాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు వి.రాంభూపాల్ ప్రభుత్వాన్ని కోరారు. సోమవారం నగరంలోని కొత్తబస్టాండు కార్మిక కర్షక భవన్‌లో జరిగిన సీపీఎం జిల్లా స్థాయి సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో కురుస్తున్న వర్షాలకు వివిధ ప్రాంతాలలో పారిశుధ్య లేమితో సీజనల్ వ్యాధులు వ్యాప్తి చెంది ప్రజలు అతిసార వ్యాధి బారిన పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం వెంటనే అన్ని జిల్లాల అధికారులకు ఆదేశాలు జారీ చేయాలన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా పరిసరాలను శుభ్రంగా ఉంచడంతోపాటు స్వచ్ఛమైన తాగు నీరు అందించాలన్నారు. విద్యాశాఖలో ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీ చేయాలన్నారు. ఈ సమావేశంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు సుబ్బారావు, జిల్లా కార్యవర్గ సభ్యుడు ఎండీ ఆనంద్‌బాబు, సీనియర్ నాయకులు పుల్లారెడ్డి, జేఎన్.శేషయ్య, నాగేశ్వరరావు, అరుణమ్మ, అలివేలమ్మ పాల్గొన్నారు.

భవన కార్మికుడి మృతి

కర్నూలు, జూన్ 24: మూడో పట్టణ పోలీస్‌స్టేషన్ పరిధిలో జోహరాపురం రోడ్డులో ఓ అపార్టుమెంటులో పని చేస్తున్న కొండల్‌రావు (40) అనే భవన కార్మికుడు మృతి చెందాడు. ప్రకాశం జిల్లాకు చెందిన భవన కార్మికుడు కొండల్‌రావు స్థానిక జోహరాపురం రోడ్డులో నిర్మాణంలో ఉన్న అపార్టుమెంటులో మేస్త్రీ కింద కూలి పని చేస్తున్నాడు. సోమవారం సాయంత్రం లిఫ్టు సాయంతో ఇటుకలను నాలుగో అంతస్తులోకి లాగుతుండగా.. ఒక్కసారిగా జారి కింద పడ్డాడు ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన ఆయనను కిమ్స్ ఆసుపత్రికి తరలించారు. ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలి

కర్నూలు(న్యూసిటీ), జూన్ 24: ప్రస్తుత పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని రవాణా రంగ కార్మికులకు కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని ఆల్ ఇండియా రోడ్ ట్రాన్స్‌పోర్టు వర్కర్స్ ఫెడరేషన్ జిల్లా కార్యదర్శి కే ప్రభాకర్ డిమాండ్ చేశారు. సోమవారం సీఐటీయూ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో మోటార్ వర్కర్స్ యూనియన్ కార్యాలయంలో సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సమావేశానికి సీఐటీయూ న్యూసిటీ అధ్యక్షుడు ఆర్.నరసింహులు హాజరయ్యారు. ఈ సందర్భంగా ప్రభాకర్ మాట్లాడుతూ రవాణా రంగానికి గుదిబండలా మారిన మోటార్ యాక్ట్ సవరణ బిల్లులోని జీవో నెంబరు 21, హిట్ అండ్ రన్ చట్టాలను రద్దు చేయాలన్నారు. జీవో అమలైతే డ్రైవర్లు జైలు పాలై వారి కుటుంబాలు రోడ్డున పడే ప్రమాదముందన్నారు. ఈ సమావేశంలో జిల్లా నాయకులు గంగాధర్, వలి, తిమ్మప్ప, దస్తగిరి, నరేంద్ర పాల్గొన్నారు.

పరిసరాల శుభ్రత అందరి బాధ్యత

గూడూరు, జూన్ 24: పరిసరాల శుభ్రత అందరి బాధ్యతగా గుర్తించాలని ఎంపీడీవో విజయసింహారెడ్డి అన్నారు. సోమవారం మండలంలోని కే.నాగలాపురం గ్రామ సచివాలయం సందర్శించి సమావేశాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా ఎంపీడీవో విజయసింహారెడ్డి మాట్లాడుతూ డయేరియా నివారణపై చర్యలు తీసుకోవాలని సూచించారు. అనంతరం గ్రామంలోని వాటర్ ట్యాంకులను సందర్శించారు. ఈవోఆర్‌డీ, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ, సిబ్బంది పాల్గొన్నారు.

విద్యామండలి చైర్మన్‌పై కేసు నమోదు చేయాలి

మంత్రి నారా లోకేశ్‌కు జేఏసీ ఫిర్యాదు

కర్నూలు(అర్బన్), జూన్ 24: ఉన్నత విద్యామండలి చైర్మన్, ప్రొఫెసర్ హేమచంద్రారెడ్డి అవినీతిపైన సిట్టింగ్ జడ్జితో విచారణ చేయించి క్రిమినల్ కేసు నమోదు చేయాలని నిరుద్యోగ ఫోరం, నవ్యాంధ్ర విద్యార్థి జేఏసీ కన్వీనర్ బి.శ్రీరాములు డిమాండ్ చేశారు. మంగళవారం సచివాల యంలో రాష్ట్ర మానవ వనరుల శాఖ మంత్రి నారా లోకేశ్‌ను కలిసి ఓ వినతి పత్రం ద్వారా కోరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేద విద్యార్థులు చెల్లించిన ఫీజులను విద్యార్థుల భవిష్యత్ కోసం ఉపయోగించకుండా ఎంవోయూల పేరుతో చీకటి ఒప్పందాలు చేసుకుని కోట్ల రూపాయలు కొల్లగొట్టారని ఆరోపించారు. ఉన్నత విద్యామండలిలో విద్యార్థుల ఫీజులను జల్సాలకు ఉపయోగించి దుర్వినియోగం చేశారని పేర్కొన్నారు. రాష్ట్రంలోని వివిధ యూనివర్సిటీల్లో తన బినామిలను ఉపకులపతులుగా, రిజిస్ట్రారులుగా నియమించుకుని కోట్ల రూపాయలు దండుకున్నారని ఆరోపించారు. ఐప్యాక్, మంత్రుల కొడుకులకు, వైసీపీ కార్యకర్తలకు అర్హత లేని వారికి ఉద్యోగాలు ఇచ్చాడని, టీచింగ్, నాన్ టీచింగ్ ఉద్యోగులు, విద్యార్థులను వేధించారన్నారు. విద్యార్థులు కట్టిన 200 కోట్ల ఫీజులను మాయం చేసిన హేమచంద్రారెడ్డి అనంతపురం, బెంగళూరు, కడప, కర్నూలు, వైజాగ్ ప్రాంతాల్లో అక్రమాస్తులు కూడగట్టుకున్నారని, వెంటనే విచారణ జరిపి, సొమ్మును రీకవరి చేయాలని కోరారు. సానుకూలంగా స్పందించిన మంత్రి లోకేష్ మాట్లాడుతూ విచారణ చేసి చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.



లోకేశ్‌కు ఫిర్యాదు చేస్తున్న జేఏసీ నాయకుడు

గురువులను గౌరవించాలి: సినీ నటుడు సుమన్



విద్యార్థులనుద్దేశించి మాట్లాడుతున్న సుమన్

కోడుమూరు, జూన్ 24: విద్యార్థులు చదువు చెప్పిన గురువును గౌరవించాలని సినీ నటుడు సుమన్ అన్నారు. స్థానిక నాగార్జున స్కూల్‌ను సోమవారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కష్టపడి చదివితే విజయం తప్పకుండా వరిస్తుందని అన్నారు. అనంతరం నిర్మాణంలో ఉన్న శ్రీలక్ష్మీ వెంకటేశ్వరదేవాలయాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా ఆయనను ఆలయ చైర్మన్ ఎద్దుల మహేశ్వరరెడ్డి సన్మానించారు. ఎస్ఐ బాలనరసింహులు, నాగార్జున స్కూల్ యాజమాన్యం నాగార్జున, సూర్యరెడ్డి, సత్యారెడ్డి పాల్గొన్నారు.

పారిశ్రామికంగా అభివృద్ధి చేయాలి

కర్నూలు(అర్బన్), జూన్ 24: ఉమ్మడి కర్నూలు జిల్లాను పారిశ్రామికంగా అభివృద్ధి చేయాలని రాయల సీమ, యువజన సంఘాల జేఏసీ బీ. శ్రీరాములు అన్నారు. మంగళవారం విజయవాడలోని సచివాలయంలో రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి టీజీ భరత్‌ను కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఓర్వకలు మండలంలోని ప్రభుత్వ భూముల్లో పరిశ్రమలు నిర్మించి స్థానిక యువతకు ఉద్యోగావకాశాలు కల్పించాలని కోరారు.

మంత్రి కొల్లును కలిసిన బీసీ నాయకులు

కర్నూలు (అర్బన్), జూన్ 24: గనులు, ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్రను ఉమ్మడి కర్నూలు జిల్లాకు చెందిన బీసీ సంఘాల నాయకులు కలిశారు. మంగళవారం సచివాలయంలోని మంత్రి చాంబర్‌లో బాధ్య తలు తీసుకున్న అనంతరం ఆయనకు పుష్పగుచ్ఛం ఇచ్చి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో టీడీపీ బీసీ సెల్ రాష్ట్ర కార్యదర్శి మహేష్ గౌడ్, ఈడిగ, గౌడ సాధికార రాష్ట్ర కన్వీనరు అమర్నాథ్ గౌడ్, మల్లికార్జున, కురువ ధనుంజయులు పాల్గొన్నారు.



మంత్రి కొల్లు రవీంద్రకు పుష్పగుచ్ఛం ఇస్తున్న బీసీ నాయకులు

చిరుధాన్యాల సాగుపై అవగాహన

ఓర్వకల్లు, జూన్ 24: ఓర్వకల్లులోని ఆర్‌బీకే కేంద్రంలో సోమవారం ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం, నంద్యాల బాలభారత చిరుధాన్యాల సమన్వయ పరిశోధనం శాస్త్రవేత్తలు చిరుధాన్యాల సాగుపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా శాస్త్రవేత్త డాక్టర్ ఆర్.నరసింహులు చిరుధాన్యాలలోని వివిధ వంగడాలు, కాలపరిమితి, అంతర్‌పంటలకు పంటల సడిలి అనువైన వంగడాలను రైతులకు వివరించారు. జొన్న, పొగాకులోని వంగడాలను శాస్త్రవేత్త పుల్లిబాయి రైతులకు వివరించారు. తెగుళ్లు, జొన్న, కొర్రలో వచ్చే వివిధ పరుగుల నివారణ పద్ధతుల గురించి శాస్త్రవేత్త వెంకటరమణమ్మ వివరించారు. కార్యక్రమంలో డాక్టర్ జ్యోష్న కిరణ్మయి, ఏవో సుధాకర్, వీఏఏ సతీష్, ఓర్వకల్లు రైతులు పాల్గొన్నారు.

డయేరియాపై అప్రమత్తంగా ఉండాలి

కోడుమూరు, జూన్ 24: ప్రజలు డయేరియాపై అప్రమత్తంగా ఉండాలని ఎంపీడీవో దివ్య అన్నారు. స్థానిక మండల పరిషత్ సమావేశ భవనంలో సోమవారం డయేరియా ప్రచారంపై సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామాల్లో తాగునీటి ట్యాంక్‌లు, మురుగు కాల్వలను శుభ్రం చేయించాలన్నారు. వైద్యాధికారి శ్రీమంత్ మాదన్న మాట్లాడుతూ బ్యాక్టీరియా, వైరస్, కలుషిత ఆహారం, నీరు తీసుకోవడం వలన డయేరియా వ్యాప్తి చెందుతుందన్నారు. కార్యక్రమంలో ఆర్‌డబ్ల్యూఎస్ శ్రీనివాసులు, ఈవోఆర్డీ మంజుల, ఎంఈవో శరభయ్య, హెల్త్ అధికారులు, శాంతా, నరసప్ప, రంగస్వామి, పంచాయతీ కార్యదర్శులు అజయ్‌బాస్కర్, వెంకటేశ్వర్లు, మద్దిలేటి పాల్గొన్నారు.

జీవో 117ని రద్దు చేయాలి: ఆప్టా

కర్నూలు(ఎడ్యుకేషన్), జూన్ 24: జీవో నెంబర్ 117ని రద్దు చేసి ఉన్నత పాఠశాలలో కలిపిన 3, 4, 5 తరగతులను తిరిగి వెంటనే పాత పాఠశాలలకు కలపాలని ఏపీ ప్రైమరీ టీచర్స్ అసోసియేషన్ (ఆప్టా) రాష్ట్ర అధ్యక్షుడు ఎజీఎస్ గణపతి రావు, ప్రధాన కార్యదర్శి కాకి ప్రకాశ్ రావు, సహాధ్యక్షుడు ఎంజీ మెహది కోరారు. సోమవారం ఏపీ మానవ వనరుల శాఖ మంత్రి నారా లోకేశ్, పాఠశాల విద్యా ముఖ్య కార్యదర్శి కోనా శశిధర్‌లను కలిసి వినతిపత్రం సమర్పించారు.

లోకేశ్‌ను కలిసిన బీటీ నాయుడు



లోకేశ్‌కు పుష్పగుచ్ఛం ఇస్తున్న బీటీ నాయుడు

కర్నూలు(అర్బన్), జూన్ 24: టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, రాష్ట్ర మానవ వనరుల శాఖ మంత్రి నారా లోకేశ్‌ను శాసన మండలి సభ్యులు బీటీ నాయుడు కలిశారు. మంగళవారం సచివాలయంలోని మంత్రిగా బాధ్యతలు తీసుకున్న లోకేశ్‌కు శుభాకాంక్షలు తెలిపారు. 2019లో టీడీపీ అధికారం కోల్పోయిన తర్వాత జగన్మోహన్‌రెడ్డి ముఖ్య మంత్రిగా అప్రజాస్వామిక విధానాలతో రాష్ట్రాన్ని విచ్ఛిన్నం చేశారని, రాష్ట్ర వ్యాప్తంగా పార్టీ నాయకులు, కార్యకర్తలు, ప్రజలను ముప్పుతిప్పలు పెట్టారని విమర్శించారు.

ప్రభుత్వ స్థలాలు అన్యాక్రాంతం కాకుండా చూడాలి



తహసీల్దార్‌కు వినతిపత్రం ఇస్తున్న టీడీపీ నాయకులు

సి.బెళగల్, జూన్ 24: ప్రభుత్వ స్థలాలను అన్యాక్రాంతం కాకుండా చూడాలని టీడీపీ నాయకులు, మాజీ ఎంపీటీసీ ధనుంజయుడు, విష్ణుసేన హమాలీ యూనియన్ నాయకుడు భీమన్న, ముస్లిం మైనార్టీ నాయకుడు గౌస్, టీడీపీ మండల ఉపాధ్యక్షుడు నాగరాజు తహసీల్దార్ అనుపమను కోరారు. మండల కేంద్రంలో సోమవారం జరిగిన ప్రజా సమస్యల పరిష్కర వేదికలో తహసీల్దార్‌కు వారు వినతిపత్రం ఇచ్చారు. ఈసందర్భంగా టీడీపీ నాయకులు మాట్లాడుతూ మండల కేంద్రమైన సి.బెళగల్‌లోని ప్రభుత్వ కార్యాల యాలకు పక్కన ఉన్న సర్వే నంబరు 426లో కొండ పోరంబోకు భూములను వైసీపీ నాయ కులు ఆక్రమించుకుని ప్లాట్లు వేసి అమ్ముకున్నారని ఆరోపించారు.

జర్నలిస్టుల పిల్లలకు ఫీజులో రాయితీ ఇవ్వాలి



డీటీకి వినతి పత్రం ఇస్తున్న ఏపీయూడబ్ల్యూజే నాయకులు

గూడూరు, జూన్ 24: జర్నలిస్టుల పిల్లలకు ప్రైవేటు విద్యాసంస్థల్లో ఫీజులో 60 శాతం రాయితీ ఇవ్వాలని ఏపీయూడబ్ల్యూజే మండల అధ్యక్షుడు ఉరుకుంద డిమాండ్ చేశారు. సోమవారం గూడూరు తహసీల్దార్ కార్యాలయంలో డిప్యూటీ తహసీల్దార్‌కు ఏపీయూడబ్ల్యూజే ఆధ్వర్యంలో వినతిపత్రం సమర్పించారు. ఏపీయూడబ్ల్యూజే నాయకులు శ్రీనివాసనాయుడు, దౌలత్‌ఖాన్, కిరణ్ కుమార్, ప్రభాకర్ నాయుడు పాల్గొన్నారు.

కేజీబీవీల్లో సీట్లు పెంచాలి

కోడుమూరు, జూన్ 24: కేజీబీవీ, గురుకుల, ఆదర్శ పాఠశాలల్లో సీట్లను పెంచాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి బి.రంగస్వామి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం డిప్యూటీ తహసీల్దార్ రామాంజనేయులుకు వినతి పత్రం అందజేశారు. ఆయన మాట్లాడుతూ కర్నూలు జిల్లా వెనకబడిన జిల్లాగా పరిగణంలోకి తీసుకొని ప్రభుత్వం ఆయా పాఠశాల ల్లో సీట్లను పెంచి విద్యార్థులకు ప్రోత్సాహం అందించాలని అన్నారు. కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ నాయకులు సిద్ధు, హబీబ్, వినయ్ పాల్గొన్నారు.

ప్రభుత్వ స్థలాలు ఆక్రమిస్తే చర్యలు

కర్నూలు (కలెక్టరేట్), జూన్ 24: జిల్లా మైనార్టీలకు సంబంధించిన ప్రభుత్వ స్థలాలను ఆక్రమిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా మైనార్టీ సంక్షేమ అధికారి డా.సునీల్ కన్న హెచ్చరించారు. సోమవారం కల్లూరులోని ముజఫర్‌నగర్‌లో భూ సర్వే 524 స్థలాన్ని పరిశీ లించారు. ప్రభుత్వ స్థలంలో 10 ఎకరాల 64 సెంట్లు ప్రైవేటు వ్యక్తులు ఆక్రమించడంపై అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. గ్రామ సర్పంచ్, టౌన్ ప్లానింగ్ అనుమతి లేని ఇళ్లను గుర్తించారు.

కూటమి ప్రభుత్వానికి ధన్యవాదాలు

కర్నూలు(కలెక్టరేట్), జూన్ 24: విభిన్న ప్రతిభావంతులకు పింఛన్ రూ.3వేల నుంచి రూ.6వేలు పెంచినందుకు కర్నూలు డిస్ట్రిక్ట్ అసోసియేషన్ ఆఫ్ డెఫ్ కూటమి ప్రభుత్వానికి ధన్యవాదాలు తెలిపారు. సోమవారం కలెక్టర్ కార్యాలయం ఎదుట ప్రధాని నరేంద్రమోదీ, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్, రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి టీజీ భరత్ ఫ్లెక్సీకి క్షీరాభిషేకం చేశారు. కార్యక్రమంలో అధ్యక్షుడు వినోద్, జనరల్ సెక్రటరీ బాషా పాల్గొన్నారు.

ఆదోని

ఆదోని ● పత్తికొండ ● ఆలూరు ● ఎమ్మిగనూరు ● మంత్రాలయం

రైతులకు మంచి రోజులు

● హంద్రీ నీవా వెడల్పు పనులపై రైతుల ఆశలు
● కాలువ పనులు విస్మరించిన వైసీపీ ప్రభుత్వం

మద్దికెర, జూన్ 24: రైతులకు జీవనాధారమైన హంద్రీనీవా కాలువ వెడల్పు పనులు తిరిగి ప్రారంభ సూచనలు కనిపించడంతో రైతుల్లో ఆనందం వెల్లివిరుస్తోంది. గతంలో సాగునీటి ప్రాజెక్టులపై ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు చిత్తశుద్ధి పని చేసి పూర్తిచేశారని, ఈసారి తప్పకుండా హంద్రీనీవా కాలువ వెడల్పు పనులు పూర్తవుతాయని రైతులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. ఐదేళ్ల వైసీపీ ప్రభుత్వంలో హంద్రీనీవా కాలువ వెడల్పు పనులను పట్టించుకోలేదు. జగన్ ప్రభుత్వం పాత కాంట్రాక్టలను రద్దు పరచడమే కాక.. కొత్తగా ప్రతిపాదనలు, టెండర్లు అంటూ రెండేళ్ల మభ్యపెట్టి చివరకు మొండిచేయి చూపింది. చంద్రబాబు ఆలోచనతో రూపుదిద్దుకున్న ఈ వైడనింగ్ ప్రాజెక్టును ఆయనే పూర్తి చేసి వినియోగంలోకి తెస్తారని రైతులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. మండలంలోని బురుజుల గ్రామం నుంచి పెరవలి, హంపా, మద్దికెర, ఎడవలి, బొమ్మనపల్లి, కొత్తపల్లి గ్రామాల మీదుగా అనంతపురం జిల్లాకు హంద్రీనీవా కాలువ వెళ్తుంది. ఈ ప్రాంత రైతులు ఆ కాలువ నీటి ద్వారా పంటలు పండించుకుంటున్నారు. హంద్రీనీవా వెడల్పు చేసే ప్రాజెక్టును 2017 ఏప్రిల్ 20న చంద్రబాబు ప్రతిపాదించారు. అందుకు సంబంధించిన పైలాన్‌ను అనంతపురం జిల్లాలో ఆవిష్కరించి 90 రోజుల కాల వ్యవధిలోపు పనులు పూర్తి కావాలని అధికారులను ఆదేశించారు. అయితే, ఎస్టిమేషన్లు, టెండర్లు, అగ్రిమెంటు ప్రక్రియ కారణంగా రెండు నెలలు ఆలస్యం అయ్యింది. మరో నెల నాటికి కాలువకు నీరు విడుదల కావడంతో పనులు ఆగిపోయాయి. నీరు నిలిచిన తర్వాత 2019లో పనుల పునఃప్రారంభంలోగా 60 శాతం పనులు పూర్తయ్యాయి. 40 శాతం మట్టి పనులు, నిర్మాణ పనులు, వంతెనలు, కాలువల పనులు జరిగాయి. తీరా ఎన్నికలు రావడం.. పనులు ఆగిపోవడం తెలిసిందే. ఆనాటి నుంచి హంద్రీనీవా కాలువలో చెత్తాచెదారం పేరుకుపోవడమే కాకుండా కాలువలో అక్కడక్కడా మట్టి కూడా కొట్టుకుని పోయింది. హంద్రీనీవా కాలువ ఇరువైపులా ముళ్లపొదలతో మూసుకుపోయినా పట్టించుకునే నాథుడే కరువయ్యారు. చంద్రబాబు నాయుడు తిరిగి ముఖ్యమంత్రి కావడంతో రైతుల్లో ఆశలు చిగురించాయి. హంద్రీనీవా కాలువకు మంచి రోజులు వచ్చాయని ఆశాభావాన్ని వ్యక్తం చేస్తున్నారు.


ముళ్లపొదలతో మూసుకుపోయిన హంద్రీనీవా కాలువ

● సీఎం చంద్రబాబు పూర్తి చేస్తారు
సీఎం చంద్రబాబు రైతుల కష్టాలు తీర్చేందుకు ఆనాడు హంద్రీనీవా కాలువ వెడల్పు పనులు చేపట్టారు. జగన్ ప్రభుత్వం కక్ష కట్టి ఆ పనులను ఆపేసింది. రైతులకు మేలు చేయాలనే చంద్రబాబు సంకల్పం త్వరలో పూర్తవుతుందని భావిస్తున్నాం.
- నంది జయరాముడు, ఎడవలి

● బాబుపై నమ్మకం ఉంది
వైసీపీ హయాంలో కాలువ వెడల్పు పనులు చేయలేదు. కనీసం ఆయకట్టు చివరి వరకు కూడా నీరు ఇవ్వలేదు. మిర్చి రైతులు గత ఏడాది పడిన ఇబ్బందులు చూశారు. సీఎం చంద్రబాబుపై రైతులకు నమ్మకం ఉంది. ఆయన హయాంలో పనులు తప్పక పూర్తవుతాయని ఆనందంగా ఉన్నాం.
- చంద్రశేఖర్‌గౌడు, మద్దికెర

● కాలువ వెడల్పు పనులు పూర్తి చేయాలి
హంద్రీనీవా కాలువ పనులు ప్రారంభించింది చంద్రబాబు నాయుడే. ఇప్పుడు ఆయనే ముఖ్యమంత్రి అయ్యారు. కాబట్టి వీలైనంత త్వరగా పనులు పూర్తి చేస్తారనే నమ్మకం ఉంది.
- లక్ష్మీనారాయణ, మద్దికెర

పత్తికొండలో సినీ నటుడు సుమన్ సందడి


అభిమానులకు అభివాదం చేస్తున్న సుమన్

పత్తికొండ,జూన్24: పత్తికొండలో సినీ నటుడు సుమన్ సందడి చేశారు. సోమవారం స్థానిక అంబేడ్కర్ సర్కిల్‌లో ఎద్దుల వస్త్రదుకాణాన్ని ఆయన ప్రారంభించారు. ఎద్దుల కాటన్స్ ఛైర్మన్ ఎద్దుల మహేశ్వర్‌రెడ్డి, ఎండీ సూర్యారెడ్డి ఆయనకు స్వాగతం పలికారు. అనంతరం జ్యోతి ప్రజ్వలనతో సుమన్ దుకాణాన్ని ప్రారంభించారు. టీడీపీ నాయకులు సాంబశివారెడ్డి, మనోహర్‌చౌదరి, రామానాయుడు, బీటీ గోవింద్, సోమ్లానాయక్, పుండుకూర బ్రహ్మయ్య సుమన్‌తోపాటు ప్రారంభోత్సవంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా హీరో సుమన్‌ను చూసేందుకు అభిమానులు పెద్ద ఎత్తున తరలిరావడంతో అంబేడ్కర్ సర్కిల్ కిక్కిరిసిపోయింది. పత్తికొండ ఎస్ఐ గోపాల్ నేతృత్వంలో పోలీసులు బందోబస్తు నిర్వహించారు.

దళితుల ఆత్మగౌరవాన్ని కాపాడిన చంద్రబాబు

● అమరావతి పునర్నిర్మాణ నిర్ణయం హర్షణీయం

ఎమ్మిగనూరు టౌన్, జూన్ 24 : దళితుల ఆత్మగౌరం కాపాడిన సీఎం చంద్రబాబుకు అభినందనలంటూ సోమవారం సమతా సైనిక్ దల్ ఆధ్వర్యంలో సీఎం చిత్ర పటానికి క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా రంగయ్య మాట్లాడుతూ జగన్ ప్రభుత్వం నా ఎస్సీ, బీసీ, ఎస్టీలు అంటూ దళితులను మోసం చేశారని విమర్శించారు. దళితుల ఆత్మగౌరవం దెబ్బ తినేలా అంబేడ్కర్ వీదేశీ విద్యా పథకాన్ని జగన్ విదేశీ విద్యా కానుకగా మార్చడం దుర్మార్గపు చర్య అని పేర్కొన్నారు. 2024 సార్వత్రిక ఎన్నికల్లో కూటమి అఖండ విజయం సాధించి, చంద్రబాబు బాధ్యతలు చేపట్టిన కొన్ని రోజుల్లోనే జగన్ విదేశీ విద్యా కానుకను అంబేడ్కర్ వీదేశీ విద్యా పథకంగా ప్రారంభించడాన్ని స్వాగతిస్తూ, హర్షం వ్యక్తం చేస్తూ సోమప్ప సర్కిల్‌లో బాణసంచా కాల్చి చంద్రబాబు, అంబేడ్కర్ చిత్ర పటాలకు క్షీరాభిషేకం చేశారు. కార్యక్రమంలో మల్లేష్, పరమేష్, బలరాం, మాదన్న తదితరులు పాల్గొన్నారు.

'మీ కోసం'కు అధికారులు డుమ్మా

కోసిగి, జూన్ 24: కొత్తగా అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం ప్రతి సోమవారం తహసీల్దార్ కార్యాలయాల్లో మీకోసం కార్యక్రమాన్ని సీఎం చంద్రబాబు ప్రవేశపెట్టారు. అయితే, మొదటి రోజే మండలంలోని పలు మండల స్థాయి అధికారులు కార్యక్రమానికి గైర్హాజరు కావడంతో పలువురు ప్రజలు, టీడీపీ నాయకులు అధికారుల తీరుపై విమర్శలు గుప్పిస్తున్నారు. కోసిగిలోని తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ మురళి, ఎంఈవో, వ్యవసాయాధికారి, ఏపీవో, ఎంపీడీవో జూనియర్ అసిస్టెంట్ మరో ఇద్దరు ఉద్యోగులు మినహా మిగతా శాఖల అధికారులు గైర్హాజరయ్యారు. ముఖ్యంగా వైద్యాధికారుల నుంచి ఒక్కరూ కూడా హాజరు కాకపోవడం గమనార్హం.

కేజీబీవీలో సీట్లు పెంచాలి : ఏఐఎస్ఎఫ్

కోసిగి, జూన్ 24: కేజీబీవీ, ఆదర్శ పాఠశాలలో సీట్ల సంఖ్య పెంచాలని, దరఖాస్తు చేసుకున్న ప్రతి విద్యార్థికి సీట్లు కేటాయించాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి ఎస్.వీరేష్, మండల కార్యదర్శి అంజి కోరారు. సోమవారం తహసీల్దార్ కార్యాలయంలో మీకోసం కార్యక్రమంలో భాగంగా కేజీబీవీ, ఆదర్శ పాఠశాల, గురుకుల పాఠశాలల్లో సీట్ల సంఖ్యను పెంచి విద్యార్థుల వలసబాటను అరికట్టాలని కోరుతూ తహసీల్దార్ మురళికి వినతి పత్రం అందజేశారు. నాయకులు హాజీ, నరసింహులు, జయశాలి పాల్గొన్నారు.

మత్తు పదార్థాలకు వ్యతిరేకంగా ప్రతిజ్ఞ

ఎమ్మిగనూరు టౌన్, జూన్ 24 : స్థానిక వీవర్స్ కాలనీలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మాదక ద్రవ్యాలకు వ్యతిరేకంగా విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు.సెబ్ సీఐ భార్గవ్ రెడ్డి మాట్లాడుతూ నేటి యువత మాదక ద్రవ్యాలకు దూరంగా ఉంటూ నవ సమాజ నిర్మాణానికి కృషి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రిన్సిపాల్, ఎస్ఐ సత్యనారాయణ,భరత్, తదితరులు పాల్గొన్నారు.

పారువేటలో కింద పడిన ఎద్దు

మంత్రాలయం, జూన్ 24: మాధవరంలో ఏరువాక పౌర్ణమి అపశృతి చోటు చేసుకుంది. భక్తిశ్రద్ధలతో జరుపుకోవల్సిన ఏరువాక పౌర్ణమి పారువేటలో అపశృతి చోటు చేసుకుంది. సంత మార్కెట్ నుంచి గ్రామ చావిడి వరకు ఎద్దుల పారువేటను నిర్వహిస్తుండగా.. గ్రామ నడిబొడ్డున ఎద్దు కిందపడటంతో మిగతా ఎద్దులు ఆ ఎద్దును దాటుకుంటూ ముందుకెళ్లాయి. దీంతో గ్రామస్థులు ఆందోళనకు గురయ్యారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా మంత్రాలయం సీఐ ఎరిషావలి, ఎస్ఐ కృష్ణమూర్తి, కిషోర్, భాస్కర్, రామకృష్ణలు బందబోస్తు నిర్వహించారు.

డయేరియాను ఎదుర్కోండి

మద్దికెర, జూన్ 24: మండలంలోని అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పని చేసి డయేరియా వ్యాధిని పూర్తిగా ఎదుర్కొందామని ఎంపీడీవో అలివేలమ్మ, ప్రభుత్వా వైద్యాధికారి రాగిణి, ఎంఈవో రంగస్వామి అన్నారు. సోమవారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో డయేరియా వ్యాధిపై అన్ని శాఖల అధికారులతో సమావేశం నిర్వహిం సీజనల్ వ్యాధులపై అప్రమత్తం చేశారు.

ఉల్లి నారు కొనలేరు!

● ఒక్కసారిగా పెరిగిన ధర
● ఒక బెడ్(మడి) రూ. 3000



గోనెగండ్ల, జూన్ 24: ఒక్కసారిగా ఉల్లి నారు ధర ఆకాశాన్ని అంటింది. నిన్న మొన్నటి వరకు ఉల్లి నారు వైపు కన్నెత్తి చూడని రైతులు గత పదిరోజులుగా అడపదడపా వర్షాలు కురియడం రైతులు ఉల్లి పంటను సాగు చేసేందుకు ఆసక్తి చూపుతున్నారు. దీంతో ఉల్లినారు సాగు చేసిన రైతులు అమాంతంగా ఉల్లినారు రేటు పెంచేశారు. ఒక బెడ్(మడి) ధర రూ. 3000 పలుకుతుంది. ఒక ఎకరంలో ఉల్లినారు సాగుకు రూ. 1.50లక్ష ఖర్చు అవుతుంది. ఉల్లి విత్తనాల రేటు కూడా కిలో రూ. 150 నుంచి రూ. 600 వరకు పెరిగింది. ఒక ఎకరానికి 200 కిలోల విత్తనాలు అవసరం అవుతాయి. ఒక ఎకరంలో 190 నుంచి 200 వరకు ఉల్లినార బెడ్లు పడతాయి. ఒక ఎకరంలో ఉల్లిపంటను సాగు చేసేందకు 6 నుంచి 8 బెడ్లునారు (మడి)కవాల్సి ఉంటుంది. అయితే కొద్ది రోజులుగా ఉల్లి కి ధర లేక పోవడంతో ఉల్లి నారు సాగుకు రైతులు మక్కువ చూపలేదు. ఇప్పటికి మండలంలో దాదాపు 50 ఎకరాల్లో మాత్రమే ఉల్లి నారు సాగు చేశారు.

పొజిషన్ సర్టిఫికెట్ ఇవ్వండి

ఆదోని, జూన్ 24: ఆదోని మండలం కల్లుబావి గ్రామంలో 40 సంవత్సరాలుగా నివాసం ఉంటున్నాం.. ఇంటి స్థలానికి సంబంధించి ఎటువంటి పత్రాలు లేవు. దయతో పొజిషన్ సర్టిఫికెట్ మంజూరు చేయాల్సిందిగా కల్లుబావికి చెందిన బాలరాజు ఆదోని సబ్‌కలెక్టర్‌ను కోరారు. సోమవారం స్థానిక సబ్ కలెక్టర్ కార్యాలయంలో పబ్లిక్ గ్రీవెన్స్ రిడ్రెసెల్ సిస్టం(పీజీఆర్ఎస్) పాల్గొని, డీవిజన్‌లోని ఆయా మండలాల నుంచి వచ్చిన అర్జీలను ఆయన స్వీకరించారు.

మండలాల నుంచి వచ్చిన కొన్ని సమస్యలు..

1. ఆదోని మండలం మండిగిరి గ్రామ పంచాయతీకి చెందిన అనీష్ ఫాతిమా సంబంధించి సర్వేనెంబర్ 204/బీ 1 నందు 3.70 ఎకరాల భూమికి సంబంధించి ఆన్లైన్, పట్టాదారు పాస్ పుస్తకం మంజూరు చేయాలని అర్జీ సమర్పించారు.

2. "టిడ్కో ఇంటి కోసం గతంలో లక్ష రూపాయలు బ్యాంక్ డీడీ ద్వారా చెల్లించాం. ప్రస్తుతం మాకు ఎటువంటి టిడ్కో గృహం మంజూరు కాలేదు. బ్యాంక్ డీడీ ద్వారా చెల్లించిన నగదును తిరిగి ఇవ్వండి" అంటూ ఆదోని పట్టణం ఆర్టీసీ కాలనీకి చెందిన దాసరి యశోద అర్జీ సమర్పించారు.


అర్జీలను పరిశీలిస్తున్న ఆదోని సబ్ కలెక్టర్

3. ఆదోని మండలం గోనబావి గ్రామానికి చెందిన పకీరప్ప 2024-2025 విద్యా సంవత్సరానికి సంబంధించి తన కూతురు వెన్నెలకు ఎనిమిదవ తరగతి బదులుగా ఆరవ తరగతి అని ఆన్లైన్లో తప్పుగా నమోదు చేయడం ద్వారా కస్తుర్బా గాంధీ పాఠశాలలో 8వ తరగతి అడ్మిషన్ మంజూరు కాలేదని అర్జీ సమర్పించుకున్నారు.

కార్యక్రమంలో ఏవో శేషయ్య, సర్వేయర్ వేణుసూర్య, డీఎల్పీవో నూర్జహాన్, డిప్యూటీ డీఎంహెచ్‌వో సత్యవతి, ఆర్అండ్‌బీ ఎగ్జిగ్యూటివ్ ఇంజనీర్ కృష్ణారెడ్డి, పంచాయితీ రాజ్ ఎగ్జిగ్యూటివ్ ఇంజనీర్ వెంకట ప్రసాద్, ఆర్టీవో నాగేంద్ర, డీఎల్పీవో నాగేశ్వరరావు పాల్గొన్నారు.

ఖాళీ బిందెలతో కాలనీవాసుల నిరసన

ఎమ్మిగనూరు, జూన్24: పట్టణంలోని 32వ వార్డు రాఘవేంద్ర నగర్, సంజీవయ్యనగర్‌లలో తాగునీటి సమస్యను పరిష్కరించాలని కోరుతూ సీపీఎం ఆధ్వర్యంలో ఆయా కాలనీవాసులు ఖాళీ బిందెలతో సోమవారం నిరసన వ్యక్తం చేశారు. సీపీఎం నాయకులు గోవిందు, రాముడు, అబ్దుల్లా, తిమ్మప్పలు మాట్లాడుతూ ఐదేళ్లుగా రాఘవేంద్ర కాలనీలో తాగునీటి సమస్యతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నా అధికారులు పట్టించుకోవడంలేదని ఆరోపించారు. కాలనీలో కూలీ పనులపై ఆధారపడి జీవనం సాగిస్తున్న జనం అధికంగా ఉన్నారని తెలిపారు. తాగునీటి సమస్యను పరిష్కరించేందుకు కాలనీలో ట్యాంకర్లతో నీటిని ప్రజలకు అందిస్తున్నామని అధికారులు పేర్కొంటున్నప్పటికీ కాలనీవాసులకు సరిపోయేలా అందివ్వడంలేదన్నారు. బోర్లు వేస్తే ఫ్లోరైడ్ నీరు పడుతోందని, ఇది ప్రజల ఆరోగ్యానికి హానికరమని తెలిపారు. ఎన్నికలకు ముందు కాలనీలోకి తాగునీటి పైపులైన్ ఏర్పాటు చేస్తామని కమిషనర్ గంగిరెడ్డి హామీ ఇచ్చినప్పటికి ఇప్పటి వరకు అమలు కాలేదన్నారు. అలాగే సంజీవయ్యనగర్‌లో సైతం కాలనీ శివార్లలో తాగునీటి సరఫరా సరిగాలేక కాలనీవాసులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి వెంటనే కాలనీకి తాగునీటి పైపులైన్ ఏర్పాటు చేయాలని లేనిపక్షంలో ఆందోళనలో ఉధృతం చేస్తామని హెచ్చరించారు. అనంతరం మున్సిపల్ కమిషనర్ గంగిరెడ్డికి వినతిపత్రం ఇచ్చారు. కార్యక్రమంలో నాయకులు, కాలనీవాసులు పాల్గొన్నారు.


మున్సిపల్ కార్యాలయం ఎదుట ఖాళీ బిందెలతో నిరసన తెలుపుతున్న 32వ వార్డు ప్రజలు

బైక్ ఢీకొని వ్యక్తి మృతి

తుగ్గలి, జూన్ 24: పొలం పనులు చేసుకుని ఇంటికి ద్విచక్రవాహనం ఢీకొని తీవ్రంగా గాయపడిన రాజశేఖర్ (27) సోమవారం మృతిచెందాడు. తుగ్గలి ఎస్ఐ మల్లికార్జున తెలిపిన వివరాల మేరకు.. ముక్కెళ్లకు చెందిన కొండయ్య కుమారుడు రాజశేఖర్, తల్లి, భార్యతో కలిసి ఆదివారం ఉదయం పొలం పనులకు వెళ్లారు. పనులు ముగించుకుని సాయంత్రం ఇంటికి వెళ్లేందుకు ఎద్దులబండికి ఎద్దులు కడుతుండగా.. పత్తికొండ వైపు ద్విచక్రవాహనం అతివేగంగా అజాగ్రత్తగా వచ్చి రాజశేఖర్‌ను ఢీకొట్టింది. రాజశేఖర్ తీవ్రగాయాలకు గురై అక్కడికక్కడే కుప్పకూలిపోయాడు. తండ్రి కొండయ్య, కుటుంబ సభ్యులు హుటాహుటిన వైద్యశాలకు తరలించారు. పత్తికొండలో ప్రథమ చికిత్స చేయించి కర్నూలు తరలించగా.. కోలుకోలేక మృతి చెందాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు తుగ్గలి పోలీసులు కేసు నమోదు చేసి ప్రమాదానికి కారణమైన ద్విచక్రవాహనాన్ని, వ్యక్తిని చోధించగా.. వాహనదారుడు పత్తికొండకు చెందిన వ్యక్తిగా గుర్తించారు. మృతుడికి ఒక కుమార్తె ఉంది.

నోటీసులు ఇవ్వడం సరికాదు

మంత్రాలయం, జూన్ 24: మంత్రాలయంలో తహసీల్దార్, ఎంపీడీవో, బీఎస్ఎన్ఎల్, పోలీస్‌స్టేషన్ వంటి ప్రభుత్వ కార్యాలయాలను ఖాళీ చేయాలని శ్రీమఠం అధికారులు నోటీసులు ఇవ్వడం సరికాదని సీపీఐ జిల్లా నాయకులు భాస్కర్ యాదవ్ అన్నారు. సోమవారం మీకోసం ప్రజా సమస్యల పరిష్కార వేదికలో భాగంగా ఈ మేరకు తహసీల్దార్‌కు వినతి పత్రం అందజేశారు. మంత్రాలయంలోని రాఘవేంద్రస్వామి మఠానికి చెందిన స్థలాల్లో గతంలో పోలీస్‌స్టేషన్, బీఎస్ఎన్ఎల్, తహసీల్దార్ ఎంపీడీవో కార్యాలయాలు పక్కా భవనాలు నిర్మించారు. ఇప్పుడు వాటిని ఖాళీ చేయాలని నోటీసులు ఇవ్వడం ఏమిటని ప్రశ్నించారు. మఠం అధికారులు మాత్రం సర్వేనెంబరు.1లోని దుకాణాలు, సీసీ రోడ్లు, పార్కింగ్ వేసి ఆక్రమించుకున్నా అడిగే వారు లేరని అన్నారు. ఆక్రమించుకున్న ప్రభుత్వ స్థలాన్ని ఇస్తే అక్కడే ప్రభుత్వ కార్యాలయాలు నిర్మించుకుంటున్నారని, దీనిపై పూర్తి స్థాయిలో విచారణ చేసి కార్యాలయాలు ఖాళీ చేయించకుండా చర్యలు తీసుకోవాలని అధికారులను కోరారు. సీపీఐ నాయకులు వీరేష్, మహ్మద్ ఆరీఫ్, నరసింహులు పాల్గొన్నారు.

అప్రెంటిస్ విధానంలేని నోటిఫికేషన్ ఇవ్వాలి

ఎమ్మిగనూరు , జూన్24: మెగా డీఎస్సీ ద్వారా 16,347 పోస్టులను భర్తీ చేయడానికి రాష్ట్ర మంత్రివర్గం ఆమోదించడం అభినందనీయమని, అయితే అప్రెంటిస్ విధానంలేని రెగ్యులర్ ఉపాధ్యాయుల నియామకం చేపట్టాలని యూటీఎఫ్ యల్లప్ప, నాగమణి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం సంఘం కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత ప్రభుత్వం ఎన్నికలకు ముందు మెగా డీఎస్సీ పేరుతో 6100 ఉపాధ్యాయుల నియామకం కోసం డీఎస్సీ నోటిఫికేషన్ ప్రకటించిందన్నారు. అయితే నోటిఫికేషన్‌లో నియామకం పొందిన ఉపాధ్యాయులు అప్రెంటిస్ సర్వీసు చేయాలని కండీషన్ పెట్టారన్నారు. 1994 నుంచి 2008వరకు అప్రెంటిస్ విధానమనే ఒక వెట్టిచాకిరి విధానాన్ని రద్దు చేసుకోవడానికి అనేక పోరాటాలు, ఉద్యమాలు చేసి 2012 డీఎస్సీ నుంచి దాన్ని పూర్తిగా రద్దు చేయించామని పేర్కొన్నారు. రద్దు చేయించుకున్న అప్రెంటిస్ విధానం తిరిగి పునరుద్ధరించడం అత్యంత దుర్మార్గమన్నారు. దీనిపై గత ప్రభుత్వానికి నిరసన తెలిపామని, ఎన్నికల ముందు విద్యాశాఖ మంత్రి నారాలోకేశ్ అధికారంలోకి వచ్చిన వెంట నే అప్రెంటిస్ విధానం రద్దు చేస్తామని హామీ ఇచ్చారని పేర్కొన్నారు. ఇచ్చిన హామీ మేరకు అప్రెంటిస్ విధానంలేని డీఎస్సీ నోటిఫికేషన్ విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

ఏపీజీఈఏ తాలుకా నూతన కార్యవర్గం ఎన్నిక

ఎమ్మిగనూరు, జూన్24: రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల సంఘం ఎమ్మిగనూరు తాలుకా నూతన కార్యవర్గాన్ని సభ్యులు సోమవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. స్థానిక సంఘం కార్యాలయంలో జిల్లా జాయింట్ సెక్రటరి భరత్‌కుమార్ ఆధ్వర్యంలో ఎన్నుకున్నారు. అధ్యక్షులుగా యు.ఎండీ అంజాద్ అలి, కార్యదర్శిగా ప్రవీణ్‌కుమార్, కోశాధికారిగా కిశోర్‌కుమార్, ఆర్గనైజింగ్ సెక్రటరిగా భక్తరాజు, అసోసియేట్ ప్రెసిడెంట్‌గా నాగరాజు ఎన్నికయ్యారు.

పత్తికొండలో వినాయక ఘాట్ ఏర్పాటు చేయాలి

పత్తికొండ టౌన్, జూన్ 24: పట్టణంలో వినాయక నిమజ్జనానికి వినాయక ఘాట్‌ను ఏర్పాటు చేయాలని గణేష్ ఉత్సవ కమిటి సభ్యులు వీర్రాజులు, రామలింగ, బీజేపీ నాయకులు బ్రహ్మయ్య, నరేష్ అధికారులను కోరారు. సోమవారం వినాయక ఉత్సవ కమిటి ఆధ్వర్యంలో ఆర్డీవో, ఎంపీడీవోలకు ప్రజావేదిక మీకోసం కార్యక్రమంలో వినతి పత్రం అందజేశారు. అధికారులు హోసూరు సమీపంలో హంద్రీనీవా కాలువ బైపాస్‌లో వినాయక ఘాట్‌లను ఏర్పాటు చేయాలని కోరారు.

జర్నలిస్టుల పిల్లలకు ఫీజులో రాయితీ ఇవ్వాలి


ఎంఈవో శ్రీనివాసులుకు వినతిపత్రం అందజేస్తున్న జర్నలిస్టులు

ఆదోని (అగ్రికల్చర్), జూన్ 24: ప్రైవేటు కార్పొరేట్ విద్యాసంస్థల్లో చదువుతున్న జర్నలిస్టుల పిల్లలకు 60 శాతం ఫీజు రాయితీ కల్పించాలని ఏపీయూ డబ్ల్యూజే డిమాండ్ చేసింది. యూనియన్ రాష్ట్రకమిటీ పిలుపు మేరకు జిల్లా వ్యాప్తంగా జర్నలిస్టులు ఆయా మండల కేంద్రాల్లో తహసీల్దార్లు, అధికారులను కలిసి వినతి పత్రాలు అందజేశారు. ఆదోనిలో మండల విద్యాశాఖ అధికారి కార్యాలయం వద్ద తాలూకా అధ్యక్షుడు బత్తిని మల్లికార్జున, ప్రధాన కార్యదర్శి హుస్సేన్, జిల్లా ఉపాధ్యక్షుడు దేవదాస్ ఆందోళన చేపట్టి ఎంఈవో శ్రీనివాసులకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రైవేటు కార్పొరేట్ విద్యాసంస్థలు గతంలో అమలవుతున్న ఫీజు రాయితీని తమ పిల్లలకు ఇవ్వడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. వెంటనే ఫీజురాయితీని అమలుపరిచేలా చూడాలన్నారు. నాయకులు సురేంద్ర, చిన్న, మంజునాథ్, ఖాసిం, శ్రీను, బసవరాజు పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

ప్రభుత్వ ఉద్యోగుల సంఘం నూతన కమిటీ ఎన్నిక

పత్తికొండ,జూన్24: పత్తికొండ తాలూకా ఏపీప్రభుత్వ ఉద్యోగుల సంఘం నూతన కమిటీని సోమవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. జిల్లాజాయింట్ సెక్రటరీ అంజనేయులు నాయక్ ఆధ్వర్యంలో ఎన్నికల నిర్వహణ జరిగింది. అధ్యక్షులుగా రియాజ్‌బాషా, కార్యదర్శిగా టీ.భరత్, కోశాధికారిగా జిలానీబాషా, ఆర్గనైజింగ్‌కార్యదర్శిగా యండీ దివాకర్, ఉపాధ్యక్షుడిగా డి.వెంకటేష్ ఎన్నికయ్యారు. ఉద్యోగులు హక్కుల, సమస్యలపరిష్కారంకోసం పనిచేస్తామని నూతన కార్యవర్గం సభ్యులు తెలిపారు.

ఆలూరు, జూన్ 24: ఏపీ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం తాలుకా అధ్యక్షురాలిగా శశికళ, కార్యదర్శిగా ఉల్లెప్ప, కోశాధికారిగా విష్ణువర్ధన్, ఆర్గనైజింగ్ కార్యదర్శిగా రాజన్న ఎన్నికయ్యారు. ఏపీ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం నూతన కార్యవర్గాన్ని సోమవారం మండల పరిషత్‌లో జిల్లా సహాయ కార్యదర్శి సురేష్ రెడ్డి ఆధ్వర్యంలో ఎన్నుకున్నారు.

పత్తికొండ టౌన్ : ఏపీ ప్రభుత్వ ఉద్యోగుల నియోజకవర్గ నూతన కమిటి అధ్యక్షులుగా షేక్ రియాజ్‌బాషా, కార్యదర్శిగా భరత్‌లు ఎన్నికయ్యారు. సోమవారం పత్తికొండలో జరిగిన ప్రభుత్వ ఉద్యోగుల నియోజకవర్గ స్థాయి సమావేశం జరిగింది. జిల్లా జాయింట్ సెక్రటరీ అంజనేయులు నాయక్ హాజరయ్యారు.

సినీ నటుడు సుమన్ సందడి

దేవనకొండ ,జూన్ 24 : దేవనకొండలో సినీ నటుడు సుమన్ సందడి చేశారు. స్థానిక లక్ష్మీరంగా కళ్యాణ మండపంలో మండల టీడీపీ నాయకులు, మాజీ సర్పంచు లక్ష్మీదేవమ్మ, బడిగింజల రంగన్నలు సుమన్‌ను సన్మానించారు. అలాగే బజాజ్ షోరూం నూతన భవనం వద్ద ఓనర్ ఫజుల్ సన్మానించారు. టీడీపీ నాయకులు మలకన్న, వీరేష్, మధుసూదన్, రాజశేఖర్‌గౌడ్, భాస్కర్ తదితరులు ఉన్నారు.

●మండలంలోని గురుకుల, కేజీబీవీ పాఠశాలలో అదనంగా సీట్లను పెంచాలని ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో తహసీల్దార్ ఈశ్వరయ్య శెట్టికి వినతి పత్రం అందజేశారు. జిల్లా ఉపాధ్యక్షులు శరత్ భాస్కర్, మధు, శశి తదితరులు ఉన్నారు.

వలసల నివారణకు చర్యలు చేపట్టండి

ఆలూరు, జూన్ 24: ఆలూరు ప్రాంతంలో వలసల నివారణకు చర్యలు తీసుకోవాలని ఆలూరు నియోజకవర్గ జనసేన పార్టీ ఇన్‌చార్జి వెంకప్ప కోరారు. సోమవారం ఆలూరు ఎంపీడీవో నరేంద్ర కుమార్‌తో మండల సమస్యలపై చర్చించారు. అడిగిన వారందరికీ ఉపాధి కల్పించాలని కోరారు. ఆయన వెంట జనసేన నాయకులు రంజిత్, చత్రపతి పాల్గొన్నారు.

గ్రామాల్లో మురికి కాలువలపై దృష్టి సారించండి

మంత్రాలయం, జూన్ 24: వర్షాకాలం కావడంతో గ్రామాల్లో పేరుకుపోయిన మురుగు కాలువలపై దృష్టి సారించాలని ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ వేద స్వరూప, ఈవోఆర్‌డీ ప్రభావతిదేవి, మండల వైద్యాధికారి గోవిందమ్మ అన్నారు. సోమవారం ఎంపీడీవో కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. వర్షాకాలం గ్రామాల్లో ఆయా కాలనీల్లో నీరు నిల్వ లేకుండా దోమలు వ్యాప్తి చెందకుండా శుభ్రపరచాలని ఆదేశించారు. కార్యదర్శి వేణుగోపాల్, ఇస్రత్‌బాషా, మహేష్, వెంకటరత్నం, స్వామినాథన్ పాల్గొన్నారు.

విద్య ఎంతో ప్రధానమైనది

● మాజీ ఎమ్మెల్యే మీనాక్షినాయుడు

ఆదోని, జూన్ 24: ప్రతి మనిషి జీవితంలో విద్య ఎంతో ప్రాముఖ్యమైనదని, దేశం అభివృద్ధి చెందాలంటే విద్యపై ఆధారపడి ఉందని టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే మీనాక్షినాయుడు అన్నారు. సోమవారం పట్టణంలోని 20వ వార్డు మండిగిరి కాలనీ టీడీపీ ఇన్‌చార్జి శ్రీనివాసులు ఆచారి సొంత ఖర్చులతో ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు నోట్ పుస్తకాలను మీనాక్షినాయుడు చేతుల మీదుగా అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం అందిస్తున్న అవకాశాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకొని భవిష్యత్తులో ఉన్నత శిఖరాలకు ఎదగాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యుడు భాస్కర్ ఆచారి, టీడీపీ సీనియర్ నాయకులు బుద్ధారెడ్డి, బాలాజి, లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

పాఠశాల అభివృద్ధికి కృషి చేస్తా

మంత్రాలయం, జూన్ 24: నియోజకవర్గంలోని అన్ని పాఠశాలలను అభివృద్ధి చేసి బడుగు బలహీన వర్గాల విద్యార్థులకు ఉన్నత విద్యను అందించేలా చర్యలు తీసుకుంటామని టీడీపీ నాయకులు రామక్రిష్ణారెడ్డి అన్నారు. సోమవారం రచ్చుమర్రి సమీపంలో ఏపీ మోడల్ స్కూల్‌లో ప్రభుత్వం నుంచి మంజూరైన కిట్లను ప్రిన్సిపాల్ ప్రసాద్ ఆధ్వర్యంలో పంపిణీ చేశారు. ఉపాధ్యాయులు మంజునాథ్, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

కార్యకర్తలకు అండగా ఉంటాం

తుగ్గలి, జూన్ 24: పార్టీ కోసం అహర్నిశలు పని చేసిన కార్యకర్తలకు అండగా ఉంటామని టీడీపీ రాష్ట్ర కార్యదర్శి తుగ్గలి నాగేంద్ర, మాజీ జడ్పీటీసీ సభ్యురాలు వరలక్ష్మి అన్నారు. సోమవారం మండల కేంద్రమైన తుగ్గలిలో టీడీపీ మహిళా కార్యకర్తలు, కార్యకర్తలు నాగేంద్ర దంపతులకు పూలమాలలు, శాలువలతో సన్మానం చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ రవి, నారాయణగౌడు, రాము, రామానాయుడు ఉన్నారు.

నేడు వేలం పాటలు

మద్దికెర, జూన్ 24: మద్దికెర పంచాయతీ కార్యాలయంలో మంగళవారం, దినసరి, సంత మార్కెట్, వేలం పాటలు నిర్వహిస్తున్నట్లు సర్పంచు బండారు సుహాసిని, ఈవోఆర్‌డీ మద్దిలేటి స్వామి తెలిపారు. సోమవారం విలేకరులతో మాట్లాడుతూ ఎన్నికల కోడ్ ఉన్నందున మార్కెట్ వేలం పాటలు వేయలేదన్నారు. జూలై 1 నుంచి 2025 మార్చి 31 వరకు సుంకం వసూలు చేసుకునేందుకు వేలం పాటలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

అధికారుల తీరు మారదు

మద్దికెర, జూన్ 24: ప్రజా సమస్యల పరిష్కారం కోసం ఏర్పాటు చేసిన మీకోసం ప్రజా సమస్యల పరిష్కార వేదికకు 5 శాఖల అధికారులు మాత్రమే హాజరయ్యారు. దీంతో అధికారుల తీరు మారడం లేదని ప్రజలు చర్చించుకుంటున్నారు. సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదికను ఎంపీడీవో కార్యాలయంలో ఏర్పాటు చేశారు. తహసీల్దార్ రజాక్‌వలి, ఎంపీడీవో అలివేలమ్మ, వ్యవసాయ శాఖ అధికారి ఉప్పర రవి, హౌసింగ్ ఏఈ సుధాకర్, ఏపీవో నర్సిరెడ్డి మాత్రమే ప్రజా సమస్యల పరిష్కార వేదికకు హాజరయ్యారు. మిగతా శాఖల అధికారులు రాకపోవడం చర్చనీయాంశంగా మారింది.